## ఎన్నికల రిజర్వేషన్ పెండ్లి



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 15 అక్టోబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 281 | పేజీలు: 8+4 | వెల రూ.5

## 8 నెలల కష్టం వారంలో నాశనం

బిట్టూ తబాహి ఆవేదన



2

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



4వ రోజు

### శక్తి స్వరూపిణి..
# మహాచండీ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజున కనకదుర్గమ్మ వారు శ్రీ మహాచండీ దేవిగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఎరుపు రంగు పట్టుచీర, స్వర్ణాభరణాల శోభతో విలసిల్లిన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. చండీ సప్తశతి పారాయణాలు, విశేష కుంకుమార్చనలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు పకడ్బందీ క్యూలైన్లు, అన్నదానం, ప్రసాద వితరణ ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు.

# దుర్గమ్మ సేవలో రాష్ట్రపతి

**భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం అక్టోబర్ 14న విజయవాడ చేరుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఆమె పర్యటన బెజవాడలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది.**

విజయవాడ, మనం ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్రలతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రపతికి ఘనంగా సాదర ...మిగతా 2లో



# స్థానిక.. పంచాయతీ
## మోగిన ఎన్నికల నగారా







ఎన్నికల షెడ్యూల్ విడుదల • స్థానికంపై ఆల్‌పార్టీస్ ఫోకస్ • పట్టు కోసం కూటమి.. పాగా కోసం వైసీపీ • రిజర్వేషన్లు ఎవరికి లాభం..?

**ఏపీలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. మరోసారి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చేసింది. ఇప్పుడు జరిగేది పేరుకి స్థానిక ఎన్నికలే అయినా.. మధ్యంతర ఎన్నికల తరహా రాజకీయ వేడి ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పార్టీలన్నీ స్థానిక ఎన్నికల కోసం వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధం కావడం.. మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు వంటి అంశాలు.. స్థానిక సమరాన్ని ఖరీదైన పోరుగా మార్చేస్తాయనే అంచనాలున్నాయి.**

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: ఏపీలో మరో నెల రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు రెండున్నరేళ్ల క్రితం ఘన విజయంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి నిజంగా ఒక పెద్ద అగ్ని పరీక్షగా మారబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తేనే రాష్ట్రంలో పరిస్థితులు అన్నీ బావున్నాయని ప్రజలు నమ్ముతారు లేదంటే విపక్షాలు రాజకీయంగా పైచేయి సాధించే అవకాశాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు ఏకంగా 164 స్థానాలు సాధించి భారీ విజయాన్ని నమోదు చేశాయి. అప్పటి నుంచి ప్రభుత్వం సాఫీగా ...మిగతా 2లో

# ఎన్నికల షెడ్యూల్ విడుదల
## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు



**అమరావతి, మనంప్రత్యేక ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలయ్యింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల అధికారులు బుధవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 28న రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పోరేషన్లకు, 77 మున్సిపాలిటీలు ,10 నగర పంచాయతీలకు ఎన్నికలు, 30న ఫలితాలను విడుదల చేస్తామని వెల్లడించారు. ఈనెల 18న నామినేషన్ల దాఖలు, 19న స్క్రూటినీ, 21న నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 5న ఫలితాలను వెల్లడిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతాయని వివరించారు. తొలి దశ నవంబర్ 26, రెండో దశ నవంబర్ 29న, మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికల ...మిగతా 2లో

# 16న ఇంద్రకీలాద్రికి ముఖ్యమంత్రి

రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ కనకదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

మూలా నక్షత్రం రోజున అన్ని క్యూలైన్లలో పూర్తిగా ఉచిత దర్శనం

ప్రోటోకాల్, అంతరాలయ దర్శనాలు పూర్తిగా రద్దు

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 14 (మనం న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత పవిత్రమైన మూలా నక్షత్రం రోజున (ఈ నెల 16వ తేదీ, శుక్రవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజున అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని లక్షలాదిగా తరలివచ్చే ...మిగతా 2లో

### ఎన్నిక ఏదైనా.. విజయం
# కూటమిదే

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం,అక్టోబర్14 (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్లో ఎన్నిక ఏదైనా విజయం కూటమిదేనని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ...మిగతా 2లో

# వైసీపీకి ఓటమి భయం
# అందుకే ఆరాటం



### మంత్రి నారాయణ ఫైర్

**నెల్లూరు, అక్టోబర్ 14 (మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్సీపీ నేతలు చేస్తున్న అర్థం పర్థం లేని ఆరోపణలపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వార్డుల విభజన, రిజర్వేషన్లు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి చట్టప్రకారం, పారదర్శకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, నిబంధనల ప్రకారమే ...మిగతా 2లో

# జనసేన పార్టీలోకి వంగవీటి రాధాకృష్ణ

పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి, అక్టోబర్ 14(మనం ప్రతినిధి):** దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరేందుకు జనసేన కేంద్ర కార్యాలయానికి బుధవారం సాయంత్రం వచ్చిన వంగవీటి రాధాకృష్ణ పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని సాదరంగా స్వాగతం పలికారు.

అనంతరం రాధాకృష్ణ తన అనుచరులను పవన్ కళ్యాణ్ పరిచయం చేశారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా ఫోటోలు తీయించుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం కలసికట్టుగా పని చేద్దామని, ప్రజాసేవలో సమష్టి గా ముందుకు వెళదామని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.





## పేదల సంక్షేమమే కూటమి
# ప్రభుత్వ లక్ష్యం

3



## నిష్కల్మషమైన సేవతోనే
# దైవానుగ్రహం



అహంకారాన్ని వీడి అమ్మవారిని హృదయపీఠంపై కొలువుదిద్దుకోవాలి

శ్రీపీఠంలో మహాశక్తి యాగం నాలుగో రోజు పరిపూర్ణానంద స్వామి ప్రసంగం

అష్టమి నాడు కమలాలతో అమ్మవారికి మహా అలంకరణ

నవశక్తి హోమాలకు ప్రత్యేక ఏర్పాట్లు



**కాకినాడ రూరల్, అక్టోబర్ 14(మనంన్యూస్):** మనసులోని అహంకారాన్ని విడిచిపెట్టి, నిష్కల్మషమైన హృదయంతో అమ్మవారికి సేవ చేసినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందగలమని పరిపూర్ణానంద స్వామి అన్నారు. పూజలు చేయడం, పుష్పాలు సమర్పించడం, హోమాల్లో పాల్గొనడం మాత్రమే కాకుండా ఆలయాన్ని శుభ్రం చేయడం, అన్నదానానికి సహకరించడం వంటి ప్రతి పనినీ అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. కాకినాడ శ్రీ పీఠంలో ...మిగతా 2లో

## 'గంగానమ్మ' ఆధ్యాత్మిక
# గీతం విడుదల



**సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**రాజమహేంద్రవరం,అక్టోబర్14 (మనం న్యూస్):** గంగానమ్మ పిక్చర్స్' ప్రొడక్షన్ బ్యానర్స్ మోటేపల్లి సత్యవతి, చాయా దేవి సంయుక్తంగా నిర్మించిన 'గంగానమ్మ' ఆధ్యాత్మిక ప్రత్యేక గీతాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ బుధవారం రాజమహేంద్రవరంలోని తమ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు.రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్, దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చిత్ర బృందం మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఈ పాటను ప్రదర్శించారు. పాటను తిలకించి, ఆలకించిన అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. సమాజంలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించేలా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పాటను తెరకెక్కించినందుకు చిత్ర యూనిట్ను అభినందించారు. సాంస్కృతిక విశిష్టతను చాటేలా రూపొందిన ఈ గీతం వినసొంపుగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ బృందం ఇలాంటి ...మిగతా 2లో

## దసరా ఉత్సవాల్లో ఏఐతో భక్తుల భద్రతకు పెద్దపీట

- కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నాం
- డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



2

### గాంధీ తొలి కార్యక్షేత్రం డర్బన్‌లో
# ఆయుర్వేద మూలికల ఉద్యానవనం

మహాత్ముడి మనవరాలు ఇలా గాంధీ సారథ్యంలో ఏర్పాటు



**జొహాన్నెస్ బర్గ్, అక్టోబర్ 14:** యువ న్యాయవాదిగా దక్షిణాఫ్రికాలో పని చేస్తున్న కాలంలో మహాత్మాగాంధీ 1904లో డర్బన్‌లో ప్రారంభించిన సమష్టి ఆశ్రమం 'ఫీనిక్స్ సెటిల్మెంట్'లో సంప్రదాయ ఆయుర్వేద మూలికల ఉద్యానవనం ఏర్పాటైంది. మహాత్ముడి మనవరాలు ఇలా గాంధీ సారథ్యంలోని ట్రస్టు ఈ వేదిక ద్వారా పలు సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోంది. డర్బన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, మత.. భాషా హక్కుల కమిషన్ సంయుక్తంగా భారత ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఇక్కడ భారత్-దక్షిణాఫ్రికా సంప్రదాయ వైద్య సదస్సు, ...మిగతా 2లో

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్

3



# పడవ బోల్తా 14 మంది మృతి

బిహార్లో జరిగిన ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి.. పరిహారం ప్రకటన

**పట్నా, అక్టోబర్ 14:** బిహార్లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సుమారు 20 మందితో వెళ్తోన్న పడవ గంగా నదిలో బోల్తా పడడంతో ఈ దుర్ఘటన జరిగింది. 14 మంది మృతి ...మిగతా 2లో

# నిష్కల్మషమైన సేవతోనే దైవానుగ్రహం



(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం బుధవారం కూడా ఎంతో ఘనంగా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ హరిద్రాదేవిగా దర్శనం ఇచ్చారు. నాలుగో రోజు కూడా భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పరిపూర్ణానంద స్వామి వారు మాట్లాడుతూ మనసనే హృదయపీఠంపై అహంకారానికి బదులుగా అమ్మవారిని కొలువుదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, నవశక్తి హోమాలు, ప్రకృతి పరిరక్షణ, సేవాభావం, దాతల సహకారం తదితర అంశాలను వివరించారు.

శ్రీపీఠంలో ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే విశేష హోమాలు రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. హోమాల అనంతరం బలిహరణ, అమ్మవారి కీర్తనలు, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. వివిధ ప్రాంతాల్లో ఉండి ప్రత్యక్షంగా హాజరుకాలేని భక్తుల కోసం సాయంత్రం జరిగే హోమాలు, కీర్తనలు, హారతి కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో నివసించే భక్తులు కూడా ఈ కార్యక్రమాలను వీక్షించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి యాగ ప్రాంగణానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. మహాశక్తి యాగం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాకుండా సేవాభావం, సమష్టి సంకల్పం, ప్రకృతి పరిరక్షణ, అహంకార విసర్జన వంటి విలువలను ఆచరణలో పెట్టే ఆధ్యాత్మిక వేదికగా నిలవాలని పరిపూర్ణానంద స్వామి ఆకాంక్షించారు. దాతలు, సేవకులు, కార్యకర్తలు, భక్తుల సమష్టి కృషితో అష్టమి నాటి కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

**హరిద్ర అలంకరణలో అమ్మవారి దర్శనం**

నాలుగో రోజు సాయంత్రం అమ్మవారు హరిద్ర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హరిద్ర అంటే పసుపు అని, భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో పసుపుకు పవిత్రత, శుభప్రదతకు ప్రత్యేక స్థానం ఉందని వివరించారు. అర్గ స్తోత్రం, దేవీ సూక్తం ఆధారంగా హోమాలు నిర్వహించడంతో పాటు వారాహి, బగళాముఖి, ప్రత్యంగిర తదితర దేవతలకు సంబంధించిన విశేష హోమాలు జరగనున్నట్లు చెప్పారు. ఉత్తర భారతదేశంలోని అమ్మవారి సన్నిధిలో తయారు చేసిన రక్షలను శ్రీపీఠానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాటిని అమ్మవారికి సమర్పించి పూజల్లో వినియోగించిన అనంతరం భక్తులకు అందించనున్నట్లు వివరించారు. సప్తమి రోజున మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా రక్షలు అందించే ఆలోచన ఉందని చెప్పారు. ఇతర భక్తులకు కూడా వీలైనంత మందికి రక్షలు అందేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. నవమి, దశమి రోజుల్లో పూర్ణాహుతి, అమ్మవారి కల్యాణం, వెయ్యి కలశాలతో కలశాభిషేకం వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అష్టమి నాడు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని, ముందుగానే కార్యాలయంలో సంప్రదించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**మూడు విభాగాలుగా మహాశక్తి యాగం**

మహాశక్తి యాగంలో తొలి విభాగంగా మూడు రోజుల కార్యక్రమాలు పూర్తయ్యాయని, నాలుగో రోజు నుంచి రెండో విభాగంలోకి ప్రవేశించామని స్వామి తెలిపారు. నాలుగు, ఐదు, ఆరు రోజుల్లో అమ్మవారిని దివ్యమైన మంత్రాలు, ఆహుతులు, హోమాలతో ఆరాధిస్తామని వివరించారు. సప్తమి, అష్టమి, నవమి రోజుల్లో మూడో విభాగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి మూడు బీజాక్షరాలైన ఐం, హ్రీం, శ్రీంల ఆధారంగా మూడు విభాగాలుగా పూజా కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. ఏ మంత్రంతో ఎన్ని ఆహుతులు సమర్పించాలి, ఏయే ద్రవ్యాలతో హోమాలు నిర్వహించాలి అనే సంప్రదాయబద్ధమైన విధానాన్ని శ్రీపీఠంలో అనుసరిస్తున్నామని వివరించారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలో భక్తులు ఏకాగ్రతతో పాల్గొని అనుకున్న సంఖ్యను అధిగమించేలా కృషి చేయాలని సూచించారు. మంత్రాలను శ్రద్ధగా వింటూ కుంకుమార్చన చేయడం ద్వారా ఆధ్యాత్మిక సాధనలో మనసును లగ్నం చేయాలని అన్నారు.

**రోజుకు 25 వేల నుంచి 30 వేల మందికి అన్నప్రసాదం**

మహాశక్తి యాగంలో ప్రతిరోజూ సుమారు 25 వేల నుంచి 30 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్నట్లు స్వామి తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులకు భోజనాలు సమకూర్చడం వెనుక అనేకమంది దాతలు, కార్యకర్తలు, సేవకుల కృషి ఉందని పేర్కొన్నారు. ఇంటికి పది మంది అతిథులు వచ్చినా భోజన ఏర్పాట్లకు ఎంత ఖర్చవుతుందో ఆలోచించాలని, అలాంటిది వేలాది మందికి ప్రతిరోజూ అన్నదానం చేయడానికి ఎంతటి వనరులు, సమన్వయం అవసరమవుతాయో అర్థం చేసుకోవాలని అన్నారు. బియ్యం, కూరగాయలు, పుష్పాలు, పూజా సామగ్రి వంటి అవసరాలను పలువురు స్వచ్ఛందంగా సమకూరుస్తున్నారన్నారు.

అష్టమి రోజున భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ రోజు యాగ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులందరూ క్రమశిక్షణతో పాల్గొని కార్యక్రమాల విజయానికి సహకరించాలని కోరారు. శ్రీపీఠంలో దీర్ఘకాలంగా సేవ చేస్తున్న మహిళలు ఈసారి మహాశక్తి యాగానికి అవసరమైన పుష్పాలంకరణను స్వయంగా నిర్వహిస్తున్నారని పరిపూర్ణానంద స్వామి వివరించారు. సుమారు 25 మంది మహిళలు పూలమాలలు కుట్టడం, వివిధ దేవతామూర్తులకు అలంకరణలు సిద్ధం చేయడం వంటి సేవల్లో నిమగ్నమయ్యారని తెలిపారు. 20 నుంచి 25 ఏళ్లుగా తనతో కలిసి ప్రయాణిస్తూ పుష్పాలంకరణలో అనుభవం సంపాదించిన మహిళలు ఈసారి యాగానికి అవసరమైన అలంకరణలను తామే తయారు చేయాలని సంకల్పించుకున్నారని చెప్పారు. ప్రతి మంగళవారం, బుధవారం, శుక్రవారం నిర్వహించే పూజలకు కూడా వీరే పుష్పాలను సిద్ధం చేస్తున్నారని వివరించారు. సేవలో పాల్గొనే ప్రతి మహిళ, ప్రతి దాత, ప్రతి కార్యకర్త తన వ్యక్తిగత అహంకారాన్ని పక్కనపెట్టి అమ్మవారిపై భక్తితో పనిచేయాలని సూచించారు. సేవ అనేది చిన్నది, పెద్దది అనే తేడా లేకుండా ప్రతి పనినీ పవిత్రమైన సంకల్పంతో చేయాలని అన్నారు.

**అహం పోతే అమ్మ ఉంటుంది నవశక్తి హోమాలతో ఆధ్యాత్మిక సాధన**

శ్రీపీఠంలోని యాగశాలలో ప్రతిరోజూ వారాహి, బగళాముఖి, ప్రత్యంగిర తదితర దేవతలకు నవశక్తి హోమాలు నిర్వహిస్తున్నట్లు స్వామి తెలిపారు. శరభేశ్వరుడు, ప్రత్యంగిర, మార్తాండ భైరవుడు, క్షేత్రపాలుడు, నకులేశ్వరి, దండిని తదితర దేవతల ఆరాధనలోని ఆధ్యాత్మిక భావాలను వివరించారు. ప్రత్యంగిరాదేవి ఆరాధనను ప్రతిబంధకాలను అధిగమించే శక్తికి ప్రతీకగా, మార్తాండ భైరవుడి ఆరాధనను ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనే ఆధ్యాత్మిక బలానికి ప్రతీకగా అభివర్ణించారు. క్షేత్రపాలుడిని తేజస్సు, ఓజస్సు, స్ఫూర్తిని పెంపొందించే దైవంగా, నకులేశ్వరి దేవతను వివాదాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తికి ప్రతీకగా ప్రస్తావించారు. దండిని దేవతను ఈర్ష్య, అసూయ, పగ వంటి ప్రతికూల భావనల నుంచి రక్షణ కల్పించే దైవశక్తిగా వివరించారు. ఈ దేవతల ఆరాధన ద్వారా భక్తులు ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, ఏకాగ్రతను పెంపొందించుకోవాలని సూచించారు. అష్టమి నాడు భక్తులు స్వయంగా నవశక్తి హోమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు శ్రీపీఠంలోని సంబంధిత కౌంటర్లో వివరాలు తెలుసుకోవాలని కోరారు.

# దసరా ఉత్సవాల్లో ఏఐతో భక్తుల భద్రతకు పెద్దపీట

- **డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

**విజయవాడ,అక్టోబర్ 14,(మనం ప్రతినిధి):** ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. పోలీసు శాఖలో కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నాం అని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మీడియా పాయింట్ లో మాట్లాడారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో సంప్రదాయ పోలీసు బందోబస్తుతోపాటు సాంకేతిక నిఘా వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ ఆధారిత రద్దీ విశ్లేషణ ద్వారా భక్తుల రాకపోకలను అంచనా వేయడం, రద్దీ పెరిగే ప్రాంతాలను గుర్తించడం, అవసరమైన చోట్ల సిబ్బందిని అప్రమత్తం చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టారు.

**డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**

కొండపై, ఘాట్రోడ్డు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. డ్రోన్ల నుంచి అందే దృశ్యాలను కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానించి పరిస్థితులను సమీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ పెరిగినప్పుడు సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించేందుకు ఈ వ్యవస్థలు తోడ్పడనున్నాయి.

**వాహనాల నియంత్రణకు ఆధునిక సాంకేతికత**

దేవస్థానం పరిసరాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏ.ఎన్.పి.ఆర్) కెమెరాలు, బూమ్ బ్యారియర్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అనుమతి ఉన్న వాహనాల ప్రవేశాన్ని నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించి, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యం.

**కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా సమన్వయం**

పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా వివిధ ప్రాంతాల పరిస్థితులను సమన్వయంతో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాల్లో సాంకేతిక సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నారు. అవసరమైన సందర్భాల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేస్తున్నారన్నారు.

భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, క్యూలైన్లలో క్రమశిక్షణతో ముందుకు సాగాలని, అనుమతి లేని మార్గాల్లోకి వెళ్లరాదని అధికారులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఇతరుల సహాయం అవసరమైన భక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే సమీప పోలీసు సిబ్బందికి తెలియజేయాలని కోరుతున్నారు.

దసరా ఉత్సవాల్లో ఏఐతోపాటు మానవ పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పోలీసు బందోబస్తు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం కీలకమని అధికారులు భావిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన అమ్మవారి దర్శనం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని డీజీపీ తెలిపారు. దేవస్థానం ఇ.ఓ శీనా నాయక్, నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు డీజీపీ వెంట ఉన్నారు.

# 8 నెలల కష్టం వారంలో నాశనం

- **బిట్టూ తబాహి ఆవేదన**

**భోపాల్, అక్టోబర్ 14:** మధ్యప్రదేశ్ లోని అజ్నార్ నదిని ఇటీవల 20ఏళ్ల యువకుడు బిట్టూ తబాహి శుభ్రం చేసిన విషయం పాఠకులకు విదితమే. దీని కారణంగా దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందడం.. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న పలువురు యువకులు నడుల శుభ్రతకు నడుం బిగించడం తెలిసిందే. ఎనిమిది నెలల పాటు తీవ్రంగా శ్రమించి, టన్నుల కొద్దీ చెత్తను ఒంటిరాగానే తొలగించాడు.

అయితే, శుభ్రం చేసిన కొన్ని వారాలకే మళ్లీ ఆ నది ప్లాస్టిక్ సంచులు, చెత్తతో నిండిపోవడంతో బిట్టూ తీవ్ర ఆవేదన చెందాడు. ఈ విషయాన్ని ఇన్ స్టాలో పంచుకుని ఒకింత ఉద్వేగానికి లోనయ్యాడు.'నా ఎనిమిది నెలల కఠోర శ్రమ ఇలా వృథా అవుతుందని ఎప్పుడూ ఊహించలేదు. నాకు ఈత రాకపోయినా, ప్రత్యేక పరికరాలు లేకపోయినా ఎంతో కష్టపడి నదిని శుభ్రం చేశాను. అయినా ప్రజలు మళ్లీ చెత్తాచెదారంతో కలుషితం చేశారు. కానీ నేను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. మళ్లీ నదిని శుభ్రం చేస్తాను. ఈ పనిని త్వరగా పూర్తి చేయాలంటే ఏం చెయ్యాలో సలహా ఇవ్వండి' అని బిట్టూ నెటిజన్లను కోరాడు. అజ్నార్ నదిలోని ప్లాస్టిక్ సంచులను బయటకు తీస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అతడి పట్టుదలను, నిబద్ధతను నెటిజన్లు అభినందిస్తున్నారు. నదుల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేసేవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.మధ్యప్రదేశ్లోని రాజ్ గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన సురేంద్ర సింగ్ చౌధరీ (బిట్టూ తబాహి) డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారడాన్ని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈత రాకున్నా.. గ్లౌజ్లు, బూట్లు లేకపోయినా.. కొందరు స్నేహితుల సహాయంతో 8 నెలల పాటు నదిలోని వ్యర్థాలు తొలగించి వార్తల్లో నిలిచాడు.

## ఎన్నిక ఏదైనా.. విజయం
# కూటమిదే

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయని, కూటమి ప్రభుత్వ విధానాలు, ప్రజాహిత కార్యక్రమాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల విశ్వాసం, కార్యకర్తల సమష్టి కృషితో కార్పొరేషన్ నుంచి గ్రామ పంచాయతీ వరకు అన్ని స్థాయిల్లో కూటమి అభ్యర్థులు విజయభేరి మోగిస్తారని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# దుర్గమ్మను సేవలో రాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ యంత్రాంగం ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతి పర్యటనకు ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేశారు.

**ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం**

విమానాశ్రయం నుండి రాష్ట్రపతి నేరుగా రోడ్డు మార్గాన విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండీ దేవి అలంకరణ రోజున కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. ద్రౌపది ముర్ము అమ్మవారి సన్నిధిలో దాదాపు అరగంట పాటు ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె పర్యటన దృష్ట్యా భక్తుల భద్రత కోసం ఆ సమయంలో సాధారణ దర్శనాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. దర్శనానంతరం ఆమె రాత్రికి విజయవాడలోని నోవాటెల్ హోటల్లో బస చేశారు.

**నేడు'సరస్ మేళా' ప్రారంభం**

అక్టోబర్ 15 గురువారం రాష్ట్రపతి విజయవాడలో పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జాతీయ సరస్ మేళా 2026 లో ఆమె పాల్గొంటున్నారు. విజయవాడ పున్నమి ఘాట్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక మేళాను రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభిస్తారు.

దేశవ్యాప్తంగా 30కి పైగా రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, 'లఖ్పతి దీదీ'లతో రాష్ట్రపతి ప్రత్యేకంగా సమావేశమై, వారితో కలిసి విందు చేయనున్నారు. మహిళా సాధికారత, గ్రామీణ ఆర్థికాభివృద్ధిపై ఈ సందర్భంగా చర్చ జరగనుంది.

# ఎన్నికల రిజర్వేషన్ పెండ్లి

**సాలూరు, అక్టోబర్ 14:** తమ కుటుంబానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవి కోసం ఒక యువకుడు ఉన్నపళంగా పెండ్లి చేసుకున్నారు. అంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ ప్రకటన వెలువడిన 24 గంటల్లోనే ప్రేమించిన యువతిని వివాహమాడారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ వైకుంఠపు హర్షవర్ధన్ మున్సిపల్ ఛైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అధ్యక్ష పీఠం బీసీ మహిళకు కేటాయిస్తూ సోమవారం రిజర్వేషన్ ఖరారైంది. తనకు పోటీ చేసే అవకాశం లేకుండా పోవడంతో మహిళల కోటాలో భార్యనైనా నిలబెట్టాలనుకున్నారు. ఆలోచన వచ్చిందే తడవుగా రంగంలోకి దిగారు. వెంటనే ఇంట్లో పెద్దలను ఒప్పించి ప్రేమించిన యువతి మంజీరను స్థానిక ఆలయంలో మంగళవారం వివాహం చేసుకున్నారు. ఈసారి ఛైర్పర్సన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండగా.. తన భార్యకు పార్టీ టికెట్ దక్కేలా హర్షవర్ధన్ ప్రయత్నిస్తున్నారు.

# వైసీపీకి ఓటమి భయం అందుకే ఆరాటం

(మొదటి పేజీ తరువాయి)



ముందుకు వెళ్లాలని కలెక్టర్కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ బీసీ కోటాలో పోటీ చేయాలనుకున్నంత మాత్రాన రిజర్వేషన్లు మార్చలేదని, రోస్టర్ ప్రకారమే మేయర్ స్థానం ఓసీ జనరల్గా ఖరారైందని తెలిపారు. తన నియోజకవర్గంలోనూ పలు డివిజన్ల రిజర్వేషన్లు మారినా తాము జోక్యం చేసుకోలేదని, ఓటమి భయంతోనే వైసీపీ ఉనికి కోసం ఆరాటపడుతోందని ధ్వజమెత్తిన మంత్రి, కేవలం టీవీలలో లైవ్లు మరియు పేపర్లలో ఉండాలనే ఉద్దేశంతోనే ఆ పార్టీ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంత వాతావరణంలో, పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిష్పక్షపాతంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని మంచి చేసే వారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# ఎన్నికల షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన రోజునే ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

**నామినేషన్ల గడువు: అక్టోబరు 18**
**ఉపసంహరణ గడువు: అక్టోబరు 21**
**పోలింగ్ తేదీ: అక్టోబరు 28**
**ఓట్ల లెక్కింపు: అక్టోబరు 30**

**ఎంపీటీసీ, జడ్పీటీసీ..**

**నోటిఫికేషన్: అక్టోబరు 19**
**నామినేషన్ల గడువు: అక్టోబరు 23**
**ఉపసంహరణ గడువు: అక్టోబరు 27**
**ఎన్నికల తేదీ: నవంబరు 3**
**ఓట్ల లెక్కింపు: నవంబరు 5**

**మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు..**

గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత జరగనున్నాయి. ఎన్నికలు జరిగిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుంది.

**తొలి విడత..**

**నోటిఫికేషన్: నవంబరు 13**
**నామినేషన్ల గడువు: నవంబరు 17**
**ఉపసంహరణ గడువు: నవంబరు 21**
**పోలింగ్ తేదీ: నవంబరు 26**

**రెండో విడత..**

**నోటిఫికేషన్: నవంబరు 16**
**నామినేషన్ల గడువు: నవంబరు 20**
**ఉపసంహరణ గడువు: నవంబరు 24**
**పోలింగ్ తేదీ: నవంబరు 29**

**మూడో విడత..**

**నోటిఫికేషన్: నవంబరు 19**
**నామినేషన్ల గడువు: నవంబరు 23**
**ఉపసంహరణ గడువు: నవంబరు 27**
**పోలింగ్ తేదీ: డిసెంబరు 2**

# 'గంగానమ్మ' ఆధ్యాత్మిక గీతం విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మరెన్నో మంచి భక్తిపాటలను సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. మంత్రి దుర్గేష్ ను కలిసిన వారిలో నిర్మాతలు మోటేపల్లి సత్యవతి, చాయా దేవి, దర్శకుడు సాయి తేజ, సంగీత దర్శకుడు సత్య కశ్యప్, కొరియోగ్రాఫర్ సాగర్ వేలూరు, చీఫ్ అసోసియేట్ ఎడిటర్ నాగేంద్రలతో పాటు గంగానమ్మ పాత్రధారి శ్రియా బెండాడి, చైల్ ఆర్టిస్ట్ దేవాన్షి, నటీనటులు వంశీ మోటేపల్లి, కల్యాణ్ నాయుడు, నవ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# 14 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

చెందారు. వీరిలో అత్యధికులు చిన్నారులు. వైశాలీ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రధానమంత్రి రూ.2లక్షల చొప్పున, రాష్ట్ర ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ రూ.4లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఆయుర్వేద మూలికల ఉద్యానవనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భగా ఉద్యానవన ప్రారంభోత్సవం జరిగింది. ఈ నెల 2వ తేదీన గాంధీ జయంతి నాడు ఆయుర్వేద మూలికల వనం ఏర్పాటు పనులు మొదలుపెట్టి, 11వ తేదీ నాటికి ఒక రూపం తీసుకువచ్చారు. 'ప్రపంచం వాతావరణ పరిరక్షణ చర్యలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో గాంధీజీ ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది' అని డర్బన్లోని భారత దౌత్యాధికారి నితిన్ సుభాష్ యోలా అన్నారు.

# 16న ఇంద్రకీలాద్రికి ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

సామాన్య భక్తులందరికీ శ్రీ అమ్మవారి దివ్య దర్శనం సులభంగా, త్వరితగతిన లభించాలనే ఉద్దేశ్యంతో సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ అన్ని క్యూలైన్లను పూర్తిగా ఉచిత దర్శన మార్గాలుగానే నిర్వహించనున్నట్లు మరియు క్యూలైన్లలో వేచి ఉండే సాధారణ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరాయంగా దర్శనం కొనసాగేలా చర్యలు చేపట్టబడునని కమీషనర్, దేవదాయ శాఖ కె. రామచంద్రమోహన్, ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ సంయుక్తంగా ప్రకటించారు.

సాధారణ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 16వ తేదీన అన్ని రకాల అంతరాలయ దర్శనాలు, ప్రోటోకాల్/సిఫార్సు దర్శనాలను పూర్తిగా రద్దు చేయడం జరిగినదని, భక్తులందరికీ ముఖమండపం నుంచే సరస్వతీ దేవి అలంకార దర్శనం కల్పించబడుతుందని తెలియచేసారు. అట్లే మూలా నక్షత్రం రోజున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండుటకు గాను కొండపైకి ఎటువంటి ప్రైవేటు వాహనాలు అనుమతించబడవు. ఇప్పటికే జారీ చేసిన అన్ని రకాల వాహనాల పాసులు (సర్వీస్ పాసులతో సహా) తాత్కాలికంగా హోల్డ్ ఉంచబడతాయి. అత్యవసర విధుల్లో ఉండే అధికారిక రవాణా మాత్రమే అనుమతించబడుతుంది. సామాన్య భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తీసుకున్న నిర్ణయాలకు ప్రముఖులు, భక్తులు సంపూర్ణంగా సహకరించి, క్రమశిక్షణతో ప్రశాంత వాతావరణంలో శ్రీ సరస్వతీ దేవి అవతారంలో ఉన్న జగన్మాతను దర్శించుకోవాలని దేవస్థానం విజ్ఞప్తి చేస్తోంది.

# స్థానిక.. పంచాయతీ

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్నట్లు కనిపిస్తున్నా ఇప్పుడు గ్రామాల్లో పట్టణాల్లో జరగబోయే స్థానిక పోరు మాత్రం పాలకులకు తీవ్రమైన సవాల్ విసురుతోంది. పైకి ఇవి కేవలం సాధారణ ఎన్నికలు మాత్రమే అయినప్పటికీ క్షేత్రస్థాయిలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్సార్సీపీ ఈ పోరును చాలా సీరియస్గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తోంది.

**పట్టుకోసం కూటమి...**

రెండున్నరేళ్ల క్రితం ఘన విజయంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి నిజంగా ఒక పెద్ద అగ్ని పరీక్షగా మారబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తేనే రాష్ట్రంలో పరిస్థితులు అన్నీ బావున్నాయని ప్రజలు నమ్ముతారు లేదంటే విపక్షాలు రాజకీయంగా పైచేయి సాధించే అవకాశాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో ముందుగా పట్టణ ప్రాంతాల్లో ఆ తర్వాత గ్రామాల్లో పోరు జరగబోతుండటంతో అందరి చూపు ఈ ఫలితాలపై నిలిచింది. రాయలసీమ ప్రాంతంలో కొన్ని చోట్ల వైసీపీ ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు గట్టిగా అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా అంతర్గత విభేదాల కారణంగా కోస్తా ప్రాంతంలో సైతం కొన్ని ఎదురుదెబ్బలు తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. అధికార బలంతో విపక్షాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నా గతంలో లాగా క్లీన్ స్వీప్ చేసే పరిస్థితులు ఇప్పుడు కనిపించడం లేదు. ఇదే కనుక జరిగితే వైఎస్సార్సీపీ మళ్లీ రాష్ట్రంలో బలపడే అవకాశం స్పష్టంగా దొరుకుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ నెల రోజుల్లో జరిగే ప్రచారంలో ఏ పార్టీ పైచేయి సాధిస్తుందనే అంశం రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును పూర్తిగా మార్చేయనుంది. ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపుతారో చూడాలి.

**పాగా వేసేందుకు వైసీపీ కసరత్తు..**

రెండున్నరేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మళ్లీ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. మరి ఆ ఓట్ల శాతాన్ని వైసీపీ ఎంతవరకు నిలబెట్టుకుంటుందనేది ఇప్పుడు కీలకం కానుంది. 2019-24 మధ్య స్థానిక ఎన్నికల్లో అప్పుడ విపక్షంగా ఉన్న టీడీపీ పోటీ చేయలేదు. కానీ ఈసారి విపక్షం వైసీపీ స్థానిక సమరాన్ని చాలా సీరియస్గా తీసుకుంటోంది. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాల మాటే వినిపించొద్దని ఇప్పటికే జగన్ తమ పార్టీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. గెలుపోటములతో సంబంధం లేకుండా బలమైన అభ్యర్థులు బరిలో నిలిపి.. గట్టిగా పోరాడాలని దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీ మెజార్టీ స్థానాలు గెలిచినా.. ఆ గెలుపు మాత్రం అంత తేలికగా దక్కకూడదనేది వైసీపీ వ్యూహంగా ఉంది. దీనికి తోడు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్న మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవుల విషయంలోనూ ప్రత్యేక వ్యూహరచన ఉండాలని వైసీపీ కంకణం కట్టుకుంది.




# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- 70 మందికి రూ.31.43 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- 28 నెలల్లో 1,461 మందికి రూ.15.75 కోట్ల ఆర్థిక సాయం: మంత్రి సవిత



**పెనుకొండ అక్టోబర్ 14 మనం న్యూస్:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పరిధిలోని 70 మంది లబ్ధిదారులకు రూ.31,43,227 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండ నియోజకవర్గంలో గత 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15.75 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో అర్హులకు పింఛన్లు, గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య,పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ దండు ఈశ్వర్ ప్రసాద్,త్రివేంద్రనాయుడు,కూటమి మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ పకడ్బందీ భద్రత

- ఎస్పీ జగదీశ్
- దుర్గంలో అధికారులతో సమీక్ష..
- స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ



**కళ్యాణదుర్గం, అక్టోబర్ 14 మనం న్యూస్ :** ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీశ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అధికారులతో ఆయన ఎన్నికల బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా...**

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. రూట్ మొబైల్ పోలీసుల ద్వారా నిరంతరం గస్తీ కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, గతంలో అల్లర్లకు పాల్పడిన వారిపై నిఘా ఉంచడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన**

సమీక్ష అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కేంద్రాల వద్ద బారికేడ్ల ఏర్పాటు, సీసీ కెమెరాల నిఘా, రాకపోకల మార్గాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ టి. దైవప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మంజుల, పట్టణ సీఐ హరినాథ్, గ్రామీణ సీఐ గంగాధర్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

# జనసేన నాయకుడు తల్లిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**అన్నవరం, అక్టోబర్ 14(మనంన్యూస్):** జనసేన పార్టీ అన్నవరం నాయకుడు గుల్ల దాసు తల్లిగారు ఇటీవల మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు వరుపుల సుబ్బారావు బుధవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ, అనారోగ్య సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దాసు కుటుంబానికి ఎలాంటి సహాయం అవసరమైనా తనను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టసుఖాల్లో పరస్పరం అండగా ఉండాలని ఆయన సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వరుపుల సుబ్బారావుతో పాటు అన్నవరం ప్రాంతానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తులను కుంగదీస్తున్న సైలెంట్ కిల్లర్..

- అలర్జీ రూపంలో ప్రాణాంతక ముప్పు!
- హైదరాబాద్ యశోద హైటెక్ సిటీలో ప్రపంచస్థాయి అత్యాధునిక వైద్య సేవలు




**రాజమహేంద్రవరం : అక్టోబర్ 14 మనం న్యూస్ :** నిత్యం మనం పీల్చే గాలిలోని దుమ్ము, పక్షుల విసర్జితాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయి. దీన్ని సాధారణ అలర్జీగా భావిస్తే ప్రాణాంతక 'హైపర్ సెన్సిటివిటీ న్యూమోనైటిస్' (హెచ్పీ) వ్యాధిగా మారి ఊపిరితిత్తులు పూర్తిగా నిర్వీర్యమవుతాయి. ఈ ముప్పు పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు రాజమహేంద్రవరం స్వాధిష్ఠ హోటల్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ పల్మనాలజీ నిపుణులు గోపీ కృష్ణ ఎడ్లపాటి ఎన్నో కీలక విషయాలు వెల్లడించారు. శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో అపార అనుభవం, జాతీయ స్థాయిలో విశేష కీర్తి గడించిన గోపీ కృష్ణ యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీలోని పల్మనాలజీ-2 విభాగాధిపతిగా, క్లినికల్ డైరెక్టర్గా అనేక సంక్లిష్ట కేసులను విజయవంతంగా నయం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడారు. వ్యవసాయ, నిర్మాణ కార్మికులతో పాటు పావురాల రెట్టలు, శుభ్రం చేయని ఏసీ ఫిల్టర్ల వల్ల రోగనిరోధక వ్యవస్థ శృతిమించి ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుందని వైద్యులు స్పష్టం చేశారు. మందులు వాడినా తగ్గని దగ్గు, ఆయాసం ఉంటే తక్షణమే సీటీ స్కాన్, లంగ్ ఫంక్షన్ పరీక్షలు చేయించుకోవాలి. తొలిదశలో గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చని, నిర్లక్ష్యం చేస్తే గుండెపై భారం పడి చివరకు ఊపిరితిత్తుల మార్పిడి తప్పదని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో ఎన్95 లాంటి ప్రత్యేక మాస్కులు వాడాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఈ వ్యాధులకు అత్యుత్తమ చికిత్స అందిస్తోందని, మరింత సమాచారానికి 040-45674567 నంబరును సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాయికిరణ్, పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- పోస్టర్లు, బ్యానర్లు, వాల్ పెయింటింగ్లు పూర్తిగా నిషేధం
- ఎన్నికల నియమావళి ఉల్లంఘనతో పాటు ది రిప్రజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ ప్రకారం చర్యలు
- అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక



**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కర్నూలు నగరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.ఎన్నికలకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నగరంలోని కూడళ్లు, డివైడర్లు, స్తంభాలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, గోడలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం, వాల్ పెయింటింగ్లు వేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నియమావళితో పాటు డిఫేస్మెంట్స్ ఆఫ్ పబ్లిక్ ప్రాపర్టీ చట్టాల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ప్రచార బ్యానర్లు ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగా నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన ప్రకటన సంస్థలు నగరపాలక సంస్థ అనుమతితో ఏర్పాటు చేసిన హోర్డింగులపైనే సంబంధిత అనుమతులు, నిబంధనలకు అనుగుణంగా ప్రకటనలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని చల్లా ఓబులేసు కోరారు.

# 15 మంది ప్రయాణీకుల ప్రాణాల్ని కాపాడిన డ్రైవర్‌కి సత్కారం చేసిన జిల్లా రవాణాధికారి శ్రీనివాస్

**అమలాపురం అక్టోబర్ 14 మనం ప్రతినిధి:** బుధవారం ఉదయం ముక్కామల-చినలంక రహదారిపై హైదరాబాద్ నుండి అమలాపురం 15 మంది ప్రయాణీకులతో వస్తున్న మాన్వి ట్రావెల్స్ బస్సుకి తృటిలో ఘోరప్రమాదం తప్పింది. రావులపాలెం వెడుతున్న టిప్పర్ కి అకస్మాత్తుగా మోటార్ సైకిల్ అడ్డురాగా అతన్ని రక్షించే ప్రయత్నంలో సడెన్ బ్రేక్ వేయగా ఎదురుగా వస్తున్న మాన్వి ట్రావెల్స్ బస్సుకి అతిదగ్గరగా రాగా, రోడ్డు ప్రమాదాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ బ్రేక్ వేసి చాకచక్యంతో వేగాన్ని అదుపుచేసి ప్రక్కనే ఉన్న కాలువ అంచున ఆపి 15 మంది ప్రయాణీకుల్ని బస్సు అత్యవసర ద్వారం ద్వారా క్షేమంగా దింపి వారి మన్ననలను డ్రైవర్ ఈశ్వరరాజు అందుకున్నాడు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన డ్రైవర్ ని డీ.టీ.ఓ సత్కరించారు. డ్రైవింగ్ అంటే వాహనం నడపటమే కాకుండా - మెళకువతో వ్యవహరించి రోడ్డు ప్రమాదా జరుగకుండా చూడడమే అని డీ.టీ.ఓ అన్నారు.



రోడ్లపై తప్పులు చేసే డ్రైవర్లను శిక్షించడమే కాకుండా 15మంది ప్రయాణీకుల ప్రాణాల్ని రక్షించిన ఇటువంటి డ్రైవర్లను ప్రశంసించి, సత్కారం చేసే బాధ్యత కూడా తమపై ఉన్నదని ఈ సందర్భంగా డీ.టీ.ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

# శంఖవరం నుంచి విజయవాడకు 15 మంది భవానీల పాదయాత్ర ప్రారంభం



**శంఖవరం, అక్టోబరు 14 మనం ప్రతినిధి:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామానికి చెందిన 15 మంది భవానీ భక్తులు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. గురు భవాని మొగలి కామేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ పాదయాత్రను చేపట్టారు. భవానీ దీక్షలో భాగంగా అమ్మవారిపై అపారమైన భక్తివిశ్వాసంతో బయలుదేరిన భక్తులు, పాదయాత్రలో అమ్మవారి నామస్మరణ చేస్తూ తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొనసాగించనున్నారు. నియమనిష్ఠలు, ఆధ్యాత్మిక చింతనతో సాగనున్న ఈ యాత్ర ద్వారా కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకోవాలని భక్తులు సంకల్పించారు.

# మహా చండి దేవి అలంకరణలో దర్శనం

**కాట్రేనికోన అక్టోబర్ 14 మనం ప్రతినిధి:** శ్రీ శ్రీ శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో కోలువై యు న్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శ



రన్నవరాత్రి మహోత్సవంలో బాగంగా 4 వ రోజు శ్రీ మహా చండి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవీ గా అలంకరించారు.అమ్మవారి శాకాంబరీ దేవీ అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది 4 వ రోజు పూజ చేయించుకున్న దంపతులు పొత్తూరి సత్య నారాయణ రాజు, వీణా రాణి దంపతులు మరియు పత్సమంట్ల సూర్య నారాయణ రాజు, లక్ష్మీ కుమారి . అధిక సంఖ్యలో కుంకుమ పూజలు జరిగాయి. మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**తాడిపత్రి, అక్టోబర్ 14 మనం న్యూస్:** రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడిపత్రి మండలం ఎర్రగంటపల్లి మరియు బొందలదిన్నె గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించారు. ముందుగా ఎర్రగంటపల్లి గ్రామంలో రీసర్వే కింద గ్రౌండ్ ట్రూథింగ్ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూథింగ్ పనులను వేగంగా చేపట్టాలని, ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అందులో రీసర్వే పనుల పురోగతి గురించి వివరాలు తెప్పించుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం బొందలదిన్నె గ్రామంలో పెట్రోల్ బంకు ఎన్.ఓ.సికి సంబంధించి తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఎడి కనకప్రసాద్, తాడిపత్రి తహశీల్దార్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్

**కర్నూలు అక్టోబర్ 14 మనం న్యూస్:** కర్నూలు నగరంలో అర్హులైన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్సలు చేయించుకున్న పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కర్నూలులోని ఆయన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. షేక్ అబ్దుల్లాకు రూ.69,595, మల్లెపోగు శ్యాంబాబుకు రూ.47,780, వెంకట మహేశ్కు రూ.32,786, షేక్ ఫాతిమాకు రూ.46,032, అర్ఫాత్ కు రూ.27,480, చిత్తమూరు రమాదేవికి రూ.15 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. మొత్తంగా రూ.17,23,673 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి టీజీ భరత్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



# నవరాత్రులలో బాలా పూజ

**మహానంది, అక్టోబర్14,మనంన్యూస్:** నవరాత్రి ఉత్సవాలలో నవావరణార్చన బాల,కుమారి, సుహాసిని 3 దశలుగా వుంటుందని మహానంది దేవస్థానం వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. శ్రీ చక్రం సాక్షాత్తు లలితా శ్రీ త్రిపురసుందరి కామేశ్వరి యొక్క యంత్ర రూపమని శ్రీ చక్రార్చనలో అమ్మవారిని వివిధ ఆవరణ రూపాలలో పూజిస్తారన్నారు.వీటిలో బాలా త్రిపురసుందరి దేవి స్వరూపానికి ప్రత్యేక ప్రాధాన్యత వుందని,బాలా పూజను ఆచరించడం ద్వారా ఎంతో మంచిదన్నారు.



# ప్రజల సమస్యకు అక్షరబలం.. అధికారుల స్పందనకు అభినందనలు..

- ప్రజల పక్షాన 'మనం' దినపత్రిక!
- ఒక్కరోజులోనే అధికారుల స్పందన!
- మంగళవారం వార్త.. బుధవారం స్పందన!
- ప్రజా సమస్యపై తక్షణ చర్యలకు స్థానికుల హర్షం..
- పంచాయతీ అధికారులకు 'మనం' దినపత్రికకు కృతజ్ఞతలు



మనం ఎఫెక్ట్

**గోరంట్ల, అక్టోబర్ 14, మనం న్యూస్:** ప్రజా సమస్యను వార్తగా ప్రచురించిన మరుసటి రోజే అధికారుల నుంచి స్పందన రావడంతో గోరంట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తెస్తూ మంగళవారం 'మనం' దినపత్రికలో ప్రచురించిన వార్తకు బుధవారం స్పందన లభించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర ఎంత కీలకమో ఈ పరిణామం మరోసారి చాటిచెప్పింది. గోరంట్ల పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రోడ్డుపై డ్రైనేజీ మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న విషయాన్ని 'రోడ్డుపై మురుగునీరు.. పట్టించుకునే వారేరీ?' అనే శీర్షికతో 'మనం' దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. మురుగునీటి దుర్వాసనతో ప్రజలు పడుతున్న అవస్థలను, పారిశుద్ధ్య నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను వార్త ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మంగళవారం ప్రచురితమైన వార్తపై బుధవారం సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించడాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అలాగే సమస్యను తమ దృష్టికి తీసుకెళ్లిన 'మనం' దినపత్రికకు, స్థానిక రిపోర్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, వాటి పరిష్కారానికి దోహదపడటంలో మీడియా బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మంగళవారం వార్త ప్రచురితమై, బుధవారం స్పందన రావడం ప్రజా సమస్యలపై వార్తా ప్రభావానికి నిదర్శనమని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై అధికారులు ఇదే విధంగా తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రైనేజీ సమస్య మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బొద్దింకల బెడదకు

ముడుసుకుంటున్న ఛాతులు...
ప్రపంచంలో నియంతలందరూ
ఫోబియా గ్రస్తులంటుంటే విని
నమ్మలేకపోయాను కానీ.. నీకున్న
'కట్సరిడాఫోబియా' చూస్తే నమ్మకుండా
ఉండలేకుంటున్నాము.. తీరొక్క పూల తోట ఇది
లేత కుసుమాలు విచ్చుకుంటుంటే
చూసి మురిసిపోతావనుకున్న కానీ
ఇంతగా దడుసుకుంటావనుకోలే
కలువలనే చూసి చూసున్న నీ కనులకు
ఏ పువ్వులను చూసినా ఏవగింపు రావడం
మమ్మేమీ ఆశ్చర్య పరచలేదు కానీ
నీవు ఈ దేశపు భిన్న పూల తోటకు
ఏకైక తోటమాలివి కదా పూవులను చిదిమేస్తున్నా
కూడా.. చలించకుండా నీవుంటున్నావు చూడు
అదే నీపైన మాకు తిరస్కృతికి కారణమవుతుంది
బొద్దింకలు రోడ్డెక్కితే నీవు నీ అధికార కలుగులో
దాక్కుంటున్నావు... గుంపుగా వాళ్ళు వీధుల్లో
ప్రశ్నల పెంట వదులుతుంటే
సమాధానాలతో నీవు సాపు చేస్తావనుకుంటే
సాటు సాటుకు తప్పించుకు తిరుగుడేందుకు
తనను తాను బోనులో బంధించుకున్న పులి
గాండ్రింపులకు ఇన్నేళ్లు జడుసుకున్నాము కానీ
బొద్దింకలొచ్చాక ఆ అరుపులన్నీ
భయంతో నీవు పిచ్చిగా కూసే కూతలని తేలింది
మా నాయనమ్మ చెప్పుతుండేది
మంత్రాల బలం లేకున్నా
ఉత్త తుప్పిర్ల బలమన్న ఉండాలెరా అని
ఇప్పటికీ గానీ అర్థం కాలేదు...నీకున్నదంతా...
మంత్రాల బలము కాదు
అదంతా ఉత్త తుప్పిర్ల పనేనని
వాహనాన్ని, వాహకాన్ని రద్దు చేయగలవు కానీ
వాయువునెట్లా నిరాకరించగలవు..!?
ప్రశ్న కూడా ఇప్పుడు ఊపిరివంటిదే
ఈ దేశ ప్రజాస్వామ్య దేహానికి!!
నీవెంతో ఘనమైన వాడివని
గణతంత్ర దేశపు ఘనతను ప్రపంచ పటంలో
వెలిగిస్తావనుకుంటే ఖాకీల కాపలాతో ఇట్టా కాట
కలుపుతావనుకోలే! రంగు చూసి బెదిరేటోడికి
ఆరిద్దల చూసినా అదురే ...నిన్ను చూశాకే
అర్థమవుతుంది..అదెంత అర్థసత్యమో...!!

**- దిలీప్.వి**
8464030808

# గ్రామీణ మహిళకు 'గౌరవమే' సాధికారత



గ్రామీణ మహిళల జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే తెల్లవారకముందే మొదలయ్యే వారి దినచర్యను చూడాలి. ఎండైనా, వానైనా, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆమె బాధ్యతలు మాత్రం తగ్గవు. పంట పండితే ఇంటిల్లిపాదీ సంతోషంలో ఆమె భాగస్వామి అవుతుంది. నష్టం వస్తే కుటుంబాన్ని నిలబెట్టేందుకు తన అవసరాలను పక్కన పెడుతుంది. ఇంతటి శ్రమ చేస్తున్న గ్రామీణ మహిళకు సమాజంలో తగిన గుర్తింపు, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం లభిస్తున్నాయా అన్న ప్రశ్నకు మనం నిజాయితీగా సమాధానం వెతకాలి.

వ్యవసాయ కుటుంబంలో ఆమె రైతుతో సమానంగా శ్రమిస్తుంది. విత్తనాలు సిద్ధం చేయడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, పంట కోయడం, ధాన్యాన్ని శుభ్రపరచడం, నిల్వ చేయడం వంటి పనుల్లో ఆమె భాగస్వామ్యం ఎంతో విలువైనది. పశుపోషణ, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, ఇంటి అవసరాలకు అనుగుణంగా ఆహార పదార్థాల తయారీ వంటి పనులు కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతాయి. అయినప్పటికీ ఆమె చేసిన పనికి ప్రత్యేకమైన వేతనం లభించని సందర్భాలు అనేకం. శ్రమకు విలువ కట్టేటప్పుడు మహిళ చేతుల కష్టాన్ని కూడా లెక్కలోకి తీసుకోవడం న్యాయమైన సమాజానికి తొలి మెట్టు. గ్రామీణ మహిళ శ్రమ ఒకే వృత్తికి పరి మితం కాదు. పరిస్థితులను బట్టి కొత్త పనులను నేర్చుకుంటూ కుటుంబాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆమె కష్టం ఆదాయంలో కనిపించకపోయినా ఆర్థిక చలనంలో మాత్రం స్పష్టంగా ఉంటుంది.

భూమిని సాగు చేయడంలో మహిళ పాల్గొన్నప్పటికీ భూమి యాజమాన్య పత్రాల్లో ఆమె పేరు ఉండకపోవచ్చు. రైతుకు అందే శిక్షణ, వ్యవసాయ పరికరాలు, రుణ సదుపాయాలు, మార్కెట్ సమాచారం ఆమెకు సమానంగా అందకపోవచ్చు. పంటకు సంబంధించిన నిర్ణయాల్లో ఆమె అభిప్రాయానికి తగిన ప్రాధాన్యం దక్కాలి. గ్రామీణ మహిళ శ్రమను ఉత్పాదక శ్రమగా గుర్తించక పోవడం వల్ల మహిళకు విశ్రాంతి సమయం తగ్గుతుంది. పురు షులు, మహిళలు ఇంటి పనులను పరస్పరం పంచుకోవడం కుటుంబ సంబంధాలను బలపరచడమే కాకుండా మహిళకు చదువు, ఉపాధి, వ్యక్తిగత అభివృద్ధి కోసం సమయాన్ని అందిస్తుంది.

విద్య గ్రామీణ మహిళ జీవితంలో కొత్త దారులను తెరుస్తుంది. చదువుకున్న మహిళ తన హక్కులను తెలుసుకోగలదు, కుటుంబ ఆర్థిక వ్యవహారాలను అర్థం చేసుకోగలదు, పిల్లల విద్యపై సరైన నిర్ణయాలు తీసుకోగలదు. అయితే కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు దూరంగా ఉండటం, రవాణా సౌకర్యాల కొరత, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, చిన్న వయసులోనే ఇంటి బాధ్యతలు పెరగడం వంటి కారణాలు బాలికల చదువుకు ఆటంకం కలిగిస్తాయి. చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలకు తిరిగి విద్యను కొనసాగించే అవకాశాలు కూడా అవసరం. వయోజన విద్య, వృత్తి శిక్షణ, కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ లావాదేవీలపై అవగాహన వంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళకు కొత్త ఉపాధి మార్గాలను చూపగలవు. పల్లెల్లో బాలిక చదువు కొనసాగితే ఆ వెలుగు ఒక కుటుంబానికే కాకుండా సమాజానికంతటికీ ఉపయోగపడుతుంది.

ఆరోగ్యం విషయంలోనూ గ్రామీణ మహిళ అవసరాలను ప్రత్యేకంగా చూడాలి. అనారోగ్యాన్ని పట్టించుకోకుండా పని చేయడం, వైద్య పరీక్షలను వాయిదా వేయడం ఆమె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు, రక్తహీనత నివారణ,పోషకాహారం, ప్రసూతి సంర క్షణ, మానసిక ఆరోగ్యంపై అవగాహన అందుబాటులో ఉండాలి. సమీపంలో ఆరోగ్య కేంద్రం ఉండటంతో పాటు అవసరమైన సిబ్బంది, మందులు, రవాణా సదుపాయాలు కూడా ఉండాలి. ఆమె ఆరోగ్యాన్ని కుటుంబానికి సంబంధించిన అంశంగానే కాకుండా స్వతంత్ర హక్కుగా గుర్తించడం గ్రామీణ సంక్షేమానికి అవసరం.

ఆర్థిక స్వావలంబన మహిళలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే ముఖ్యమైన ఆధారం. చిన్న మొత్తంలో సంపాదించిన ఆదాయమైనా దానిపై ఆమెకు అవగాహన, వినియోగంపై నిర్ణయం ఉండటం ముఖ్యం. పొదుపు అలవాటు, బ్యాంకు ఖాతా నిర్వహణ, రుణాలపై స్పష్టత, వడ్డీ లెక్కలు, వ్యాపార నిర్వహణ వంటి విషయాలు తెలిసినప్పుడు ఆర్థికంగా మోసపోయే అవకాశాలు తగ్గుతాయి.

స్వయం సహాయక సంఘాలు గ్రామీణ మహిళల సామూహిక శక్తికి మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఒకే గ్రామానికి చెందిన మహిళలు క్రమం తప్పకుండా సమావేశమై పొదుపు చేయడం, అవసరమైనప్పుడు పరస్పరం సహకరించుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించడం వంటి కార్యకలాపాలు వారి జీవితాల్లో మార్పుకు దోహదపడుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ మహిళలకు కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ దాన్ని ఉపయోగించగల సామర్థ్యం అందరికీ సమానంగా లేదు. స్మార్ట్‌ఫోన్‌లో వ్యవసాయ సమాచారం తెలుసుకోవడం, డిజిటల్ చెల్లింపులు చేయడం, ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను విక్రయించడం, ప్రభుత్వ సేవలకు దరఖాస్తు చేసుకోవడం వంటి పనులు ఆదాయాన్ని పెంచగలవు. మహిళలకు స్థానిక భాషలో శిక్షణ ఇవ్వడం, సురక్షితమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించడం అవసరం.

గ్రామీణ మహిళా సాధికారతకు కుటుంబం, సమాజం, విద్యాసంస్థలు, ఆర్థిక సంస్థలు, స్థానిక పాలనా వ్యవస్థలు తమ వంతు సహకారం అందించాలి. మహిళలు గ్రామసభల్లో పాల్గొనడం, తమ ప్రాంత అవసరాలను తెలియజేయడం, అభివృద్ధి పనులపై అభిప్రాయాలు చెప్పడం ప్రోత్సహించాలి. ఉపాధి శిక్షణ ఇచ్చి వదిలేయకుండా వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, వ్యాపార సమస్యలకు పరిష్కారం చూపడం కూడా అవసరం. మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించే భాగస్వాములుగా గుర్తించినప్పుడే గ్రామీణ ప్రగతి మరింత సమగ్రంగా ఉంటుంది.

అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 15న నిర్వహించబడుతుంది. ఐక్యరాజ్య సమితి 2007లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేయగా, 2008 నుంచి దీని నిర్వహణ ప్రారంభమైంది. వ్యవసాయం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధి, పేదరిక నిర్మూలనలో మహిళల పాత్రను గుర్తించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భాన్ని గ్రామీణ మహిళల జీవితాల్లో వాస్తవ మార్పు తీసుకురావడానికి ఉపయోగించాలి. ఆమెకు భూమిపై హక్కు ఉందా, శ్రమకు తగిన ఆదాయం వస్తుందా, వైద్యం అందుబాటులో ఉందా, పిల్లల చదువుతో పాటు తన చదువుకూ అవకాశం ఉందా, కుటుంబ నిర్ణయాల్లో ఆమె మాటకు విలువ ఉందా అనే ప్రశ్నలు మన చర్చల్లో భాగం కావాలి.

పల్లె అభివృద్ధిని కొలవడానికి ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, పెరిగిన ఉత్పత్తి మాత్రమే ప్రమాణాలు కావు. అక్కడి మహిళ ఎంత ఆరోగ్యంగా ఉంది, ఆమెకు తన ఆదాయంపై ఎంత నియంత్రణ ఉంది, తన పిల్లల భవిష్యత్తుపై ఎంత నమ్మకం ఉంది, తన అభిప్రాయాన్ని ఎంత స్వేచ్ఛగా వ్యక్తపరచగలుగుతోంది అన్నది కూడా చూడాలి. పొలంలో విత్తనం నాటిన చేతికి భూమిపై హక్కు దక్కాలి. చిన్న వ్యాపారాన్ని ప్రారంభించిన మహిళకు మార్కెట్ దారి తెరుచుకోవాలి. గ్రామీణ మహిళ ముందుకు సాగితే కుటుంబం.. గ్రామం అభివృద్ధి చెందుతుంది, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తి చేరుతుంది. ఆమెను కేవలం కుటుంబానికి ఆధారంగా కాకుండా తనదైన ఆశయాలు, ఆలోచనలు, సామర్థ్యాలు కలిగిన వ్యక్తిగా గౌరవించినప్పుడే నిజమైన ప్రగతి.

**అక్టోబర్ 15 - అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం**

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284



# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన కలామ్

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం.

శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. భారత దేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్‌బుద్దీన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఒక ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలనుకున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసుకోవడానికి మద్రాసులోని ఎన్ఐటీలో చేరాడు. ఐతే ఎన్ఐటీలో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది.

ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని.. తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. స్కాలర్‌షిప్ సహాయంతో ఎంఐటిలో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వస్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్‌డీఓలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాంకి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది.

ఇప్పుడు దీనినే ఇస్రోగా పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రోను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (SLV&III)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని 'నాసా' వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో 'రోహిణి' శాటిలైట్‌ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్‌ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళి తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయవంతంగా ప్రవేశ పెట్టింది.అంతరిక్షంలోకి శాటిలైట్‌ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారత దేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరువాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్స్‌ను తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిస్సైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది.

1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళు అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే.

అందుకే ఆయనకు 'మిస్సైల్ మాన్' అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు.అబ్దుల్‌కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-II అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణుపరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది.

ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఆయన్ను 'మిస్సైల్ మాన్' అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా 'పోక్రాన్' అనే ప్రదేశంలో 'ఆపరేషన్ శక్తి' అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది.

గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కువ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం 'పద్మభూషణ్', 'పద్మవిభూషణ్', 'భారతరత్న' పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మధ్యపాన వ్యతిరేకి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

**అక్టోబర్ 15... మిస్సైల్ మ్యాన్ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494



## చతురాననుని సృష్టి

బ్రహ్మసృష్టి
అనిర్వచనీయం,అవ్యక్తం,చిత్రాతిచిత్రం,
వాచామగోచరం.
అజుని వ్రాత తెలియదు,
కమలజుని భావాలు తెలియవు.
పద్మభవుని చూడలేము,
విధాత లోకానికి వెళ్లలేము.

ద్రుహిణుడు పాదుగొలిపే జన్మ,
జీవుల కర్మఫలమే.
జీవకోటి సృష్టికి ప్రాతిపదిక
ప్రారబ్దమే.
అఖిలమంతా మాయ,
ఈ మాయ అనంతం.
మాయాతీతులం కావడం ఎవరితరం?

పితామహుని సృష్టిలో అన్నీ విచిత్రాలే,
పరమేష్ఠి సృజనలో
అన్నీ అపురూప దృశ్యాలే.
వెన్నునికొమరుని
ఊహాతీత ఈ బ్రహ్మాండంలో అన్నీ
అగణితముగ్ధమనోహరదృశ్యాలే.

విశ్వంలో విరించిసృష్టి
కమలాసనుని సృజనే.
అబ్జయోనుని ఉత్పత్తి
అనితరసాధ్యం.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# నాణ్యతా ప్రమాణాలను పాటించాలి




వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్తితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగ దారులు, నియంత్రకాలు మరియు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు యొక్క ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపుకుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణిక మైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుప బడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జాతీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిం చింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండరడ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండరడ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్.ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది.

1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో స్వీకరిం చారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూని కేషన్స్ టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్ స్టాండర్డ్సే గా జరుపు కుంటారు.

**- ఆర్‌కేఎస్**
9440595494




## జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026కు నోటిఫికేషన్ విడుదల

అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ

అక్టోబర్ 18 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ

అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన

జోన్లు, వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారులు, నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వివరాలు వెల్లడి

జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, అక్టోబర్ 14:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ను విడుదల చేసిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం, అక్టోబర్ 16వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, అక్టోబర్ 18వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ వార్డుకు కేటాయించిన సంబంధిత రిటర్నింగ్ అధికారికి నిర్ణీత గడువులోగా నామినేషన్లు సమర్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పరిధిలోని జోన్లు, వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారుల నంబర్లు, నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వివరాలను వెల్లడించారు.

# కోటబొమ్మాళిలో ఆధ్యాత్మిక శోభ..

అంబరాన్నంటిన కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల సందడి!

మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వైభవం..

కోటబొమ్మాళిలో కనులపండువగా కొత్తమ్మతల్లి శోభాయాత్ర!

భక్తజన సందోహం మధ్య వైభవంగా శోభాయాత్ర

28కి పైగా సంప్రదాయ కళారూపాలతో ప్రదర్శన

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



**కోటబొమ్మాళి: అక్టోబర్ 24:** శ్రీ కొత్తమ్మతల్లి 101వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. భక్తజన సందోహం, మంగళ వాయిద్యాల నడుమ, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలతో కోటబొమ్మాళి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సుమారు 28 రకాల శకటాలు, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నమూనాలతో రూపొందించిన శకటాలు, విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**ఘనంగా ప్రారంభమైన శోభాయాత్ర**

బుధవారం సాయంత్రం కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్ద శోభాయాత్రను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీమణి మాధవి తదితరులు ఢంకా మోగించి, జెండా ఊపి ప్రారంభించారు. నాదస్వరం, డోలు, ఇతర మంగళ వాయిద్యాల నడుమ ప్రారంభమైన ఈ యాత్ర భక్తుల్లో ఉత్సాహాన్ని నింపింది.

కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు నుంచి కొత్తపేట జంక్షన్ మీదుగా సుమారు మూడు గంటలపాటు సాగిన శోభాయాత్ర కోటబొమ్మాళి పెద్ద చెరువు వద్ద ముగిసింది.

## కైలాసగిరిపై పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభం



**విశాఖపట్నం, అక్టోబర్ 24(మనం న్యూస్):** ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిపై బుధవారం పోలీస్ ఔట్ పోస్ట్ ను వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఎమ్.ఎల్.ఏ (ఈస్ట్) వెలగపూడి రామకృష్ణ బాబు నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, సంయుక్తం గా ప్రారంభించారు గ్లాస్ బ్రిడ్జ్, రోప్ వే, శివ పార్వతుల విగ్రహం, 65 అడుగుల త్రిశూలం మరియు డమరుకం, రోప్ వే వంటి పలు ఆకర్షనీయమైన సందర్శనా ప్రాంతాలు కలిగి ఉన్న కైలాసగిరిపై పర్యాటకుల భద్రత నిమిత్తం ఒక పోలీస్ ఔట్ పోస్ట్ ను బుధవారం ప్రారంభించడం జరిగినది. ఈ పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయుటలో ముఖ్య ఉద్దేశ్యం ఈ ప్రాంతాలలో ఏటువంటి ఆకతాయిల ఆగడాలకు అవకాశం లేకుండా, పర్యాటక ప్రాంతాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, ఆయా ప్రాంతాలలో నిరంతరం పోలీసింగ్ ఉండేలా చేయడం. అత్యవసర సమయాలలో పోలీసింగ్ అందుబాటులో ఉండే ఉద్దేశంతో ఈ ఔట్ పోస్టు పనిచేసేలా తగు సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగినది. ఈ పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభ కార్యక్రమం నందు ప్రజా ప్రతినిధులు, సీపీ పాటుగా డి.సి.పి-01 (ఎల్ ఓ) వి.ఎన్.మణికంఠ చందోలు, ఏ.సి.పి (ద్వారకా) మల్లేశ్వరావు, ఆరిలోవ సీఐ (ఎల్ ఓ) శ్రీనివాసరావు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ సీఎంకు మాతృవియోగం

88 ఏళ్ల తల్లి అమ్మనమ్మ కన్నుమూత

**దేవరాపల్లి, అక్టోబర్ 14:** మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్సీపీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ బూడి ముత్యాలనాయుడుకు మాతృవియోగం కలిగింది. ముత్యాలనాయుడు మాతృమూర్తి బూడి అమ్మనమ్మ (88) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె దేవరాపల్లి మండలం తారువలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు.తల్లి మరణంతో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంట విషాదం నెలకొంది. మాతృమూర్తి పార్థివ దేహం వద్ద ముత్యాలనాయుడు, కుటుంబ సభ్యులు



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీంతో స్వగ్రామం తారువలో విషాద ఛాయలు అలుముకున్నాయి.అమ్మనమ్మ మృతి పట్ల పలువురు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వెలిబుచ్చారు.

ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతున్నట్లు ప్రకటించారు.గురువారం ఉదయం 10 గంటలకు తారువ గ్రామంలో అమ్మనమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## విశాఖ సీఫుడ్ ప్రత్యేకతను ప్రపంచానికి చాటేలా స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026

సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



**విశాఖపట్నం, అక్టోబర్ 14:** విశాఖపట్నం తీర ప్రాంత ఆహార సంస్కృతి, స్థానిక సముద్ర ఆహార వంటకాలు, సంప్రదాయ రుచులను ప్రోత్సహిస్తూ నగరాన్ని ప్రామాణిక సీఫుడ్ అనుభవాలకు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఫ్లేవర్స్ ఆఫ్ వైజాగ్- స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026' కార్యక్రమ రెండో ఎడిషన్ పోస్టర్ను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బుధవారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏఖఅఅ), జిల్లా పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (అఖఏఅ), తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ (ఇఅఖీఅ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాగర్ నగర్లోని సన్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్మెంట్ బీచ్ క్యాంపస్లో ఈ 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం జరగనుంది. ఇదిలా ఉండగా పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా టూరిజం అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే అమలు చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు



**విశాఖపట్నం, అక్టోబర్ 14:** ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, హోర్డింగ్లను వెంటనే తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు శిలాఫలకాలు, ఇతర ఫలకాలపై పేర్లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లు (ఎస్ఎస్టీ), ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందాలు (ఎంసీసీ), ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ల ఏర్పాట్లకు సంబంధించి రూట్ మ్యాప్లతో కూడిన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

గత ఎన్నికల అనుభవాలు, నిర్దేశిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సంబంధిత నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

# దుర్గమ్మను దర్శించుకున్న తుమ్మలపల్లి

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు..

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



**కిర్లంపూడి అక్టోబర్ 14(మనం న్యూస్):** కిర్లంపూడి పట్టణంలో ప్రముఖ విలేకరి ఎన్. లక్ష్మణరావు నివాసం వద్ద దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్టించిన దుర్గమ్మ తల్లి మండపాన్ని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.

ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గంధం ప్రభాకర్, నాయకులు దాడి చినబుజ్జి, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, అప్పారావుతో పాటు పలువురు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశాలను పర్యవేక్షించిన ఈవో!

మనం ఎఫెక్ట్

భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారుల చర్యలు

పరిశుభ్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

మనం వార్తకు స్పందన



**అన్నవరం, అక్టోబర్ 14, మనం న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సత్యదేవా ఉచిత వైద్యశాలపై ఇటీవల ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో బుధవారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఉచిత వైద్యశాలను స్వయంగా సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అన్నవరం దేవస్థానానికి స్వామివారి దర్శనార్థం నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తులతో పాటు స్థానిక ప్రజలకు కూడా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, వైద్య సేవల తీరుపై ఇటీవల వార్తా కథనం ద్వారా సమస్యలను ప్రస్తావించడం జరిగింది. దీనిపై స్పందించిన దేవస్థానం అధికారులు వైద్యశాల పనితీరును పరిశీలించడం హర్షణీయమైన పరిణామం. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి వైద్యశాలలో భక్తులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు అవసరం**

వైద్యశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించడం ఆహ్వానించదగిన చర్యే అయినప్పటికీ, భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా చూడటం మరింత ముఖ్యం. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం, అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల్సిన అవసరం ఉంది.

## ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్- నెతన్యాహు రహస్య చర్చలు!

అంతర్జాతీయ మీడియా కథనాలు



**వాషింగ్టన్, అక్టోబర్ 14 :** ఇరాన్‌పై భారీ దాడులను పునఃప్రారంభించాలా.. వద్దా? అనే విషయంపై అమెరికా-ఇజ్రాయెల్ రహస్య చర్చలు జరుపుతున్నట్లుగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యంలో ఎన్నికలు ముగిసేలోపు (నవంబర్ చివరి నాటికి) టెహ్రాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. గత వారం ట్రంప్‌తో సంభాషణలో భాగంగా నెతన్యాహు ఇరాన్ మళ్లీ అణ్వాయుధాల కోసం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ అణ్వాయుధ శక్తిని నిర్వీర్యం చేయడానికి దాడులను పునఃప్రారంభించేలా ట్రంప్‌ను ఒప్పించేందుకు బీబీ ప్రయత్నిస్తున్నట్లు సదరు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రణాళికల్లో భాగంగా నెతన్యాహు సలహాను ట్రంప్ అంగీకరించినట్లు సమాచారం. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ మనసు మార్చుకుంటే వెంటనే దాడులు చేసేలా అమెరికా-ఇరాన్ సైన్యాలు అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగానే అమెరికా విమాన వాహక నౌకలు సైతం పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.




# తుంగా నాగేశ్వరరావు చేరికతో ఆచంటలో జనసేనకు కొత్త ఊపు!

- పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి



**ఆచంట, అక్టోబరు 14, మనం ప్రతినిధి:** కారుణ్య ట్రస్ట్ అధినేత తుంగా నాగేశ్వరరావు జనసేన పార్టీలో చేరడంతో ఆచంట నియోజకవర్గంలో పార్టీకి కొత్త ఊపు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం ఆయన పార్టీ కండువా కప్పుకొని జనసేనలో చేరారు. ఆచంట నియోజకవర్గంతో పాటు పశ్చిమగోదావరి జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ గుర్తింపు పొందిన తుంగా నాగేశ్వరరావు చేరిక స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా తుంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జనసేన పార్టీని ఆచంట నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తుంగా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# స్వీట్స్ హౌస్ పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు!



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్):** తాడేపల్లిగూడెంలో న్యూ రాము స్వీట్స్ హౌస్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. స్వీట్స్ దుకాణం నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణంలో ప్రజల ప్రాణాలతో చెలగాటం వాడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఏ ఎస్ ఆర్ రెడ్డి ఆదేశాలతో జిల్లా అధికారి ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకలు పందికొక్కుల మధ్య స్వీట్స్ తయారు చేస్తూ ప్రజలకు హానికరమైన ఆహార పదార్థాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. వంటశాల దారుణంగా ఉందని వెంటనే ఆ వంటశాలకు తాళాలు వేయించారు. గడువు ముగిసిన స్వీట్ ను డిస్ట్రాయిడ్ చేశారు. స్వీట్స్ తయారీ కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు తదుపరి ఆదేశాల వరకు స్టాల్స్ లో విక్రయాలు జరపకూడదని నోటీసులు జారీ చేశారు. అధికారుల ఆదేశాలు అతిక్రమించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వీట్ స్టాల్ లోని ఆహార ఆహార పదార్థాల శాంపిల్స్ తీసుకుని ల్యాబ్ కి తరలిస్తున్నట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్ కుమార్ తెలియజేశారు.

# మున్సిపల్ ఇండోర్ స్టేడియం ప్రారంభం



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్):** తాడేపల్లిగూడెంలో రెండు కోట్ల రూపాయలు శాసనసభ్యులు సొంత నిధులు, దాతల విరాళాలతో మున్సిపల్ ఇండోర్ స్టేడియంను శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. తొలిత లేబర్ అడ్డ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గ అభివృద్ధికి తాను కృషి చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగమణి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో మున్సిపల్ ఇండోర్ స్టేడియం గత కొంతకాలంగా పనులు నత్తనడక సాగినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్టేడియం ప్రారంభించడం చాలా మంచి విషయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్ప శ్రీ, ఆర్డీవో సూర్యరావు, ప్రభుత్వ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో జనసేన దారెటు?

- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ఇదే సరైన సమయం
- టీడీపీ కోటాలో సీట్ల కోసం కాకుండా సొంత బలంతో సత్తా చాటాలి




**పోడూరు,అక్టోబరు 14, మనం ప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాల్లో జనసేన తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడి గత సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాయి. ఆ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ విజయం సాధించి వంద శాతం విజయాల రికార్డు సృష్టించింది. అయితే ఈ విజయం టీడీపీ మద్దతుతోనే సాధ్యమైందని, జనసేన ఒంటరిగా పోటీ చేస్తే ఇన్ని స్థానాలు గెలవలేదని అప్పట్లో పలువురు విమర్శలు చేశారు. ఈ విమర్శలకు క్షేత్రస్థాయిలోనే సమాధానం చెప్పాలంటే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన అవకాశంగా మలుచుకోవాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పొత్తుల పేరుతో టీడీపీ కేటాయించే పరిమిత స్థానాలకే జనసేన నాయకులు సంతృప్తి చెందితే గ్రామస్థాయిలో పార్టీ విస్తరణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని కార్యకర్తలు భావిస్తున్నారు. టీడీపీకి గ్రామస్థాయిలో ఇప్పటికే బలమైన రాజకీయ పునాదులు ఉండగా, జనసేన కూడా తనకంటూ స్వతంత్రంగా బలమైన పునాదులు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. 25 లేదా 30 శాతం స్థానాల కేటాయింపుతో సరిపెట్టుకోవడం కన్నా, ఒంటరిగా పోటీ చేసి ప్రజల్లో తమకున్న ఆదరణను అంచనా వేసుకోవడం మేలని అభిప్రాయపడుతున్నారు. మర్రిచెట్టు ఊడల్లా గ్రామస్థాయి వరకు విస్తరించిన టీడీపీ రాజకీయ పునాదుల మధ్య జనసేన తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసే దిశగా ఆలోచించాలని పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి అయినా తమ బలాన్ని నిరూపించుకునేందుకు వెనుకాడబోమనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరికి వారు పోటీ చేసినప్పటికీ, అనంతరం కూటమి భాగస్వాములుగా కొనసాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని నిర్మించుకునే ఈ అవకాశాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలా వినియోగించుకుంటారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పోలీసుల అవగాహన సమావేశం

**యు.కొత్తపల్లి అక్టోబర్ 14 (మనం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూలపేట గ్రామంలో బుధవారం రామాలయం వద్ద గ్రామ ప్రజలకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ ఈ సమావేశానికి నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.



# కివ్వకలో మహా చండి అవతారంలో అమ్మవారి దివ్యదర్శనం



- భజన కీర్తనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ..
- అమ్మవారి మహిమను వివరిస్తూ గురుస్వామి సందేశం

**కుక్కునూరు, అక్టోబర్ 14 (మనం న్యూస్):** ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కివ్వక గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజు అమ్మవారు మహా చండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భజన కీర్తనలు, భక్తుల కోలాటాలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

### మహా చండి రూపంలో జగన్మాత

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహా చండి రూపం ధర్మ పరిరక్షణకు, దుష్టశక్తుల సంహారానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి చండీదేవి రూపం ప్రతీకగా నిలుస్తుందని పురాణాలు తెలియజేస్తాయి. శరన్నవరాత్రుల్లో రోజుకో రూపంలో అమ్మవారిని ఆరాధించడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

### అమ్మవారి మహిమను వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశం

ఈ సందర్భంగా గురుస్వామి వీరబాబు భజన కీర్తనలు ఆలపిస్తూ అమ్మవారి మహిమ, చండీదేవి ఆరాధన విశిష్టతను భక్తులకు వివరించారు. దైవభక్తితో పాటు సత్యం, ధర్మం, దయ, మానవత్వం వంటి సద్గుణాలను జీవితంలో ఆచరించాలని సందేశమిచ్చారు. గురుస్వామి ఆలపించిన భక్తి గీతాలకు భక్తులు స్పందిస్తూ కోలాటాలు ఆడారు. అమ్మవారి నామస్మరణతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

### ప్రత్యేక పూజలు.. భక్తుల సందడి

ఆలయ ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా చండి అవతారంలో అమ్మవారిని దర్శించుకున్న భవానీ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భజన కీర్తనలు, కోలాటాల నడుమ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గురుస్వామి బట్టు వీరబాబు, భవానీ భక్తులు కృష్ణార్జునరావు, భవాని మాతాలు, భక్తులు పాల్గొన్నారు.

# యువత మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- త్రిశూల వ్యూహం పోస్టర్ ఆవిష్కరించినడిఎస్పి మేకా సుధాకర్




**పాలకొల్లు, అక్టోబర్ 14,మనం ప్రతినిధి:** త్రిశూల వ్యూహం పోస్టర్ ను డిఎస్పి మేకా సుధాకర్ ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు బిఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే స్వాగత్ ఉత్సవ వేడుక సభ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సబకు డి. ఎస్. పి మేకా సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా త్రిశూల వ్యూహం పోస్టర్ ఆవిష్కరించి దాని గురించి మాట్లాడారు. త్రిశూల వ్యూహం పేరుతో డ్రగ్స్, ట్రాఫిక్, మహిళా భద్రత,సైబర్ నేరాలు పై పోలీసులు యంత్రాంగం దృష్టి పెడుతుందని తెలిపారు. ఈ ఈ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించను నట్లు తెలిపారు. ఈరోజుల్లో క్రైమ్ రకరకాలుగా జరుగుతుందని, ప్రస్తుతం సైబర్ క్రైమ్ లో చదువుకున్న వారు, రిటైర్ అయిన వారు,అందరూ కూడా మోసపోతున్నారని తెలిపారు. గంజాయి వంటి మాధక ద్రవ్యాలకు యువత అలవాటు పడి జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని అన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో కూడా అందరు మోసపోతున్నారని జాగ్రత్తగా ఉండాలని కోరారు.విద్యార్థులు కూడా చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి స్నేహితులను ఎంచుకుని మంచి భవిష్యత్తును పొందాలని డిఎస్పి సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలోకళాశాల కమిటీ చైర్మన్ కెవిఆర్ నరసింహారావు,సీఐ జి శ్రీనివాస్, ఎస్సై పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు, కె. వి సీతారామ రాజు, రేపాక ప్రవీణ్ బాను, కటారి నాగేంద్ర కుమార్, ఏబి ఎస్ మూర్తి, ఎన్ సీతారామారావు, బిహెచ్ విశ్వనాథరాజు, నాలం శ్రీనివాస్ గుప్త, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు

**యు.కొత్తపల్లి అక్టోబర్ 14 (మనం న్యూస్):** కాకినాడ జిల్లాలో ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 2026 సంవత్సరానికి రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన జాబితాని బుధవారం ఎంపీడీవో లక్ష్మీ రెడ్డి తెలియజేశారు. మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాలను వివిధ సామాజిక వర్గాలకు కేటాయించారు. మండలంలోని ఇసుకపల్లి ఎంపీటీసీ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించగా, కొండెవరం-1, యండపల్లి-1 స్థానాలు ఎస్సీ మహిళలకు, కొండెవరం-2, కొత్తపల్లి స్థానాలు ఎస్సీ కేటగిరీకి కేటాయించారు. అదేవిధంగా, కొమరగిరి, గోర్స, కూతుకుడుమిల్లి స్థానాలు బీసీ మహిళలకు కేటాయించగా, వాకతిప్ప, నాగులపల్లి-2, పొన్నాడ-1, ములపేట-2 స్థానాలు బీసీ కేటగిరీలో ఉన్నాయి.జనరల్ మహిళలకు యండపల్లి-2, రామణక్కపేట, పొన్నాడ-2, అమీనాబాద్, ఉప్పాడ-2, ఉప్పాడ-3 తదితర స్థానాలు కేటాయించారు. జనరల్ కేటగిరీలో నాగులపల్లి-1, శ్రీరామపురం, కొత్తమూలపేట, ములపేట-1, ఉప్పాడ-1, ఉప్పాడ-4 తదితర స్థానాలు ఉన్నాయి.రిజర్వేషన్ల ప్రకటనతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు తమకు అనుకూలమైన స్థానాలపై దృష్టి సారిస్తున్నారు.

# విత్తనాల అమ్మకాల పై వర్తకులు నిబంధనలు పాటించాలి

- మండల వ్యవసాయ అధికారి పి గాంధీ



**శంఖవరం అక్టోబర్ 14 మనం ప్రతినిధి:** రైతులకు ఎరువులు,పురుగు మందులు, విత్తనాల అమ్మకాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరపాలని వర్తకులకు వ్యవసాయ అధికారి పి గాంధీ సూచించారు. శంఖవరం వ్యవసాయాధికారి వారి కార్యాలయంలో విత్తనాలు,ఎరువులు,పురుగు మందుల వర్తకులతో సమావేశం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు నిర్ణీత ధరలకే అందజేసి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. దుకాణం వద్ద స్టాక్ వివరాలు,ధరల పట్టిక ప్రతీ రోజూ ప్రదర్శించాలని,నిషేధించిన మందులు అమ్మరాదని,నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాక వారి లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్,మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల వర్తకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన సన్నద్ధం

**శంఖవరం అక్టోబరు 14 మనం ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, పోటీలో నిలిచే అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది. జనరల్ కేటగిరీలో నాగులపల్లి-1, శ్రీరామపురం, కొత్తమూలపేట, ములపేట-1, ఉప్పాడ-1, ఉప్పాడ-4 తదితర స్థానాలు ఉన్నాయి. విజయవాడ రైల్వే డివిజన్ వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడు, అసెంబ్లీ సమన్వయకర్త గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.



జనసైనికులకు ఘన సన్మానం

సమావేశం అనంతరం నియోజకవర్గ స్థాయిలో వివిధ బాధ్యతలు చేపట్టిన జనసేన నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కమిటీ సభ్యుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగుభాషాభిమానులను అలరించిన కవి సమ్మేళనం

- ఎంపీ పాకా, మాజీ ఎమ్మెల్సీ అంగర, గుడాలకు సత్కారం



**పాలకొల్లు, అక్టోబర్ 14,మనం ప్రతినిధి:** జాతీయ తెలుగు సారస్వత పరిషత్ నిర్వహించిన కవి సమ్మేళనం ఎంతగానో శ్రోతలను అలరించింది అని ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఉల్లంపర్రు మాంటెస్సోరీస్ విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన తెలుగు వైభవం కవి సమ్మేళనం లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 75 మంది కు పైబడి కవులు పాల్గొని'తెలుగు భాషా' విశిష్టత ను ప్రాచీన వైభవాన్ని వేనోళ్ళ కొనియాడారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ భాష అభివృద్ధి చెందడానికి సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పగా దోహదపడతాయి. వాటిని విడదీయలేము. పదజాలం పెరుగుదల, పండుగలు, ఆచారాలు, కళలు, వంటలు, వ్యవసాయం వంటి సాంస్కృతిక అంశాల నుండి కొత్త పదాలు, జాతీయాలు, సామెతలు పుడతాయి అని,సాహిత్య వికాసం,జానపద గేయాలు, హరికథలు, బుర్రకథలు, పురాణాలు, శతకాలు అన్నీ సంప్రదాయాలను నిలబెట్టడానికే పుట్టాయి. ఇవి భాషకు శైలిని, గాంభీర్యాన్ని ఇస్తాయి అని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ మరియు మాజీ విప్ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ చదవడం ద్వారానే భాషను బాగా అభివృద్ధి చేసుకోవచ్చు అని, తనకు ఇక్కడ జరిగిన కార్యక్రమాల ద్వారా ప్రముఖ కవులు అయినా డాక్టర్ సి నారాయణ రెడ్డి, రావూరి భరద్వాజ్, ఉత్పల సత్యనారాయణ ఆచార్యులు జంధ్యాల, ఎందరో కవులుతో కలిసి వేదికను పంచుకోవడం తనకు గొప్ప అదృష్టమని అన్నారు. భాషను కాపాడుకోవాలని దానికి జాతీయ తెలుగు సారస్వత పరిషత్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ భాషని కాపాడుకోవడం కోసం ఎన్నో సంస్థలు కృషి చేస్తున్నాయని తమ సంస్థ గత పది సంవత్సరాల నుండి 170 కార్యక్రమాలు చేసిందని, భాష కోసం, కవుల కోసం ఎంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఆరేటి ప్రకాష్ 12 మంది పిల్లలు చదివిన దానికి స్పందించి ఒక్కొక్కరికి 116 రూపాయలు బహుమతులను వ్యక్తిగతంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది విద్యార్థులు 8 సంవత్సరాల నుండి 12 సంవత్సరాలు లోపు వారు పాల్గొని అద్భుతంగా కవితలను చదివి సభకు హాజరైన ఎంతో మందితో చప్పట్లు కొట్టించుకున్నారు. ఈ పిల్లలు రాసిన కవితలు అద్భుతంగా ఉన్నాయని సభకు విచ్చేసినటువంటి ప్రముఖ కవులు పేర్కొన్నారు.కవి సమ్మేళనం అనంతరం వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందించిన శ్రీ పాకా సత్యనారాయణ, అంగర రామ్మోహన్ లకు జీవిత సాఫల్య పురస్కారంలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం క్షీర పురి ప్రముఖులైన చెరుకూరి సూరిబాబు, ఆడిటర్ పి. లక్ష్మీ నారాయణ , ఇమ్మడి రాజేష్, మద్దాల వాసు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రజనీ కుమార్, ముత్యాల రామారావు, బోళ్ళ శ్రీనివాస్, గుడాల హరిబాబు, దర్శి శ్రీనివాస గుప్తా లను వాగ్దేవి విశిష్ట సేవా పురస్కారంలతో సన్మానించారు.కవి సమ్మేళనం లో పాల్గొన్న కవులను జ్ఞాపిక, ప్రశంసా పత్రం శాలువా కప్పి ఉచిత రీతిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అద్యక్షులు ముత్యాల శ్రీనివాస్, కార్యనిర్వాహక అద్యక్షులు కేశిరాజు రాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డా కెఎస్ పి ఎన్ వర్మ, కన్వీనర్ డా పెద్దిరాజు కోలాటి, తదితర కార్యవర్గ సభ్యులు నిర్వహణా బాధ్యతలు చేపట్టి విజయ వంతంగా నిర్వహించారు.




## అన్నపూర్ణేశ్వరి దేవిగా మహాలక్ష్మి అమ్మవారు



**బేతంచేర్ల అక్టోబర్ 14(మనం న్యూస్):** పరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో ఉన్న ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ ఘన మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం శరణ్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాల్గవ రోజు మహాలక్ష్మి అమ్మవారి కి పూజలు నిర్వహించారు శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి గా పట్టు వస్త్రాలు ఆభరణాలు మరియు పూలతో అలంకరించారు ఈ కార్యక్రమాలు డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ధర్మకర్తల మండలి ఛైర్మన్ వి.ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు వేద పండితులు అర్చక స్వాములు ఆలయ సిబ్బంది మరియు భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు

# వీబీజీ రామ్ జీ పథకం కింద ఉపాధి కల్పించే శ్రామికుల సంఖ్యను పెంచాలి: కలెక్టర్ డా.ఏ.సిరి



**గూడూరు , అక్టోబర్ 14:** వీబీజీ రామ్ జీ పథకం కింద చేపట్టిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయడంతో పాటు, శ్రామికులకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డ్వామా పిడి ని ఆదేశించారు. బుధవారం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో జలధార - జలహారతి 2.0 కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన శ్రామికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.. గత వారం 80 నుంచి 90 మంది వరకు కూలీలు హాజరుకాగా, ప్రస్తుతం 110 మంది లక్ష్యానికి గాను 60 మంది మాత్రమే పనులకు వస్తున్నారని, శ్రామికులకు ఉపాధి హామీ పనుల ప్రాధాన్యతను వివరించి, పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు...ప్రతి గ్రామంలో వీబీ జీ రామ్ జీ కింద శ్రామికులకు కచ్చితంగా పని కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రామికులతో మాట్లాడుతూ వారానికి ఎన్ని రోజులు పని లభిస్తోంది, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారికి గృహ నిర్మాణ పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు 3 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ హౌసింగ్ పిడి ని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పిడి నరసింహా రెడ్డి, డ్వామా ఏపిడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.



## సీఐ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్ అక్టోబర్ 14(మనం న్యూస్): కర్నూలు జిల్లా, సి. బెలగల్ మండల పరిధిలోని బ్రహ్మణదొడ్డి, మారమడొడ్డి, బేతొలి, బురందొడ్డి, గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కోడుమూరు సీఐ , సి. బెలగల్ ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల సమయంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ, పోలీసులకు సహకరించాలని కోరారు.

## రాజ రాజేశ్వరిగా కామేశ్వరి అమ్మవారు



**మహానంది, అక్టోబర్14,మనంన్యూస్:** రాజ రాజేశ్వరి దేవిగా శ్రీ కామేశ్వరీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రులలో భాగంగా నాలుగవ రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యగశాలలో దాతలు పాల్గొనగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్,హనుమంతు శర్మల ఆధ్వర్యంలో ఋత్వికులు, అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, దీక్షాధారణ, ఋత్విక్వారున, అఖండ దీప స్థాపన, అగ్నిప్రతిష్టాపన, నవదుర్గ కలశ స్థాపన, తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహణం పై శ్రీ కూష్ మాండా దుర్గా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మౌళీశ్వర రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# సి.బెళగల్ మండలంలో సర్పంచుల రిజర్వేషన్ల షురూ!




**18 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల ఖరారు**

**పలు గ్రామాల్లో మహిళలకు అవకాశం..**

**ఎస్సీ, బీసీ వర్గాలకు కేటాయింపులు**

**సి.బెళగల్, అక్టోబర్ 14 (మనం న్యూస్):** కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచుల రిజర్వేషన్ల జాబితా విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం విడుదలైన జాబితాలో మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు వివిధ కేటగిరీల కింద రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గ్రామాల వారీగా సర్పంచుల రిజర్వేషన్లు బ్రాహ్మణదొడ్డి - బీసీ మహిళ, బురాన్దొడ్డి - అన్రిజర్వుడ్ మహిళ, సి.బెళగల్ - అన్రిజర్వుడ్ మహిళ, చింతమనుపల్లె - బీసీ జనరల్, ఇనగండ్ల - అన్రిజర్వుడ్ మహిళ, ఈర్లదిన్నె - అన్రిజర్వుడ్ జనరల్, గొల్లలదొడ్డి - బీసీ మహిళ, గుండ్రేవుల - అన్రిజర్వుడ్ జనరల్, కె. సింగవరం - ఎస్సీ మహిళ, కంబదహాళ్ - అన్రిజర్వుడ్ జనరల్, కొండాపురం - అన్రిజర్వుడ్ జనరల్, కొత్తకోట - ఎస్సీ మహిళ, మారందొడ్డి - ఎస్సీ మహిళ, ముడుమాల - అన్రిజర్వుడ్ జనరల్, పలుకుదొడ్డి - ఎస్సీ జనరల్, పోలకల్ - అన్రిజర్వుడ్ మహిళ, సంగాల - ఎస్సీ జనరల్, తిమ్మందొడ్డి - బీసీ జనరల్.

**ఆశావహుల్లో మొదలైన సందడి**

రిజర్వేషన్ల జాబితా వెలువడటంతో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ రాజకీయ సమీకరణాలపై దృష్టి సారిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పరిస్థితులను అంచనా వేస్తూ అభ్యర్థుల ఎంపికపై చర్చలు ప్రారంభించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియ, ఇతర వివరాలపై అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత ఎన్నికల సందడి మరింత పెరిగే అవకాశం ఉంది.



## పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

- కోడుమూరు నియోజకవర్గంలో రూ.7,80,370 విలువైన చెక్కుల పంపిణీ
- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, అక్టోబర్ 14(మనం న్యూస్): కోడుమూరు నియోజకవర్గానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) కింద రూ.7,80,370 విలువైన చెక్కులను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, డి. విష్ణువర్ధన్రెడ్డికి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహా చండి దేవిగా శ్రీ సుంకుల పరమేశ్వరి



**గూడూరు, అక్టోబర్ 14(మనం న్యూస్):** కర్నూలు జిల్లా గూడూరు మండలం కే.నాగలాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ సుంకుల పరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం ఉదయం ఆలయంలో శాంతి హోమాలు, నవగ్రహ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారిని మహా చండి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి అలంకరణను దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపగా, ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**ఆలయ అధికారులు, కమిటీ సభ్యుల పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రాధాకృష్ణ, ఆలయ వైస్ చైర్మన్ గోపాల్రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరాముడు, బండారి లక్ష్మీదేవి, లబ్బు అనిత, సి. మద్దమ్మ, ఏరకలి మద్దమ్మ, మండల అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు యుగేందర్, తిరుపాలు, సుంకన్న, ఆలయ అర్చకులు కృష్ణ, వెంకటేష్, ఆలయ సిబ్బంది కేశవ తదితరులు పాల్గొని ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అమ్మవారి అలంకరణలు నిర్వహిస్తున్నారు.

# దుర్గామాత నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు

**ఈ నెల 21న నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాలు**

కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. ఈ నెల 21న జరగనున్న నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని బుధవారం తుంగభద్ర నది వద్ద సంకల్పాగ్లోని దుర్గామాత ఘాట్ను ఆయన పరిశీలించారు. ఘాట్ వద్ద గుర్రపు డెక్క తొలగింపు, పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్న సిబ్బందిని కమిషనర్ అభినందించారు. మెటల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని, నిమజ్జనం కోసం రెండు క్రేన్లను సిద్ధంగా ఉంచడంతో పాటు అదనంగా మరో క్రేన్ను ఏర్పాటు చేయాలని



ఆదేశించారు. విద్యుత్ దీపాలు, వేదిక, తాగునీటి సరఫరా వంటి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతకుముందు ధర్మపేట, నరసింహారెడ్డి నగర్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. పరిమళ నగర్లోని అన్న క్యాంటీన్ను తనిఖీ చేశారు. వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక ఉన్న జీటీఎస్ స్టేషన్ను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# సీజేపీకి రాహుల్ మద్దతు



**ఢిల్లీ, అక్టోబర్ 14 :** జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని కేంద్రాన్ని విమర్శించారు. 'జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు. అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఏంటి? రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత. జంతర్ మంతర్ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటాం' అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

రాహుల్ ఈ పోస్టుపై అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు. జంతర్ మంతర్ను ధర్నా వేదికగా డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసులు ఇటీవల ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలోనే సీజేపీ ముఖ్య నేతలు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని నిరసనలకు యత్నించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

## మాపై కాదు.. సమస్యలపై దృష్టి పెట్టండి

**కేంద్ర ప్రభుత్వంపై అభిజీత్ దీప్కే విమర్శలు**



**ఢిల్లీ, అక్టోబర్ 14 :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు 5 రోజుల కస్టడీ విధించడాన్ని తప్పుబట్టారు. త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకు వారిని తీహార్ జైలుకు తరలించారని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రజాస్వామ్యం, ఓటు పరిరక్షణ కోసమే తాము ఉద్యమం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

## ఎయిరిండియా విమానానికి 'హైజాక్'!

**ఢిల్లీ, అక్టోబర్ 14 :** జర్మనీలోని ఫ్రాంక్ ఫర్ట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానానికి 'హైజాక్' అలర్ట్ రావడం తీవ్ర కలకలం రేపింది. దీంతో ఈ విమానాన్ని రాజస్థాన్లోని జైపూర్ ఎయిర్పోర్టులో అత్యవసరంగా దించి తనిఖీలు చేపట్టారు.

బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఎయిరిండియా విమానం భారత గగనతలంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు విమానం నుంచి 'స్వాక్ 7500 కోడ్' వచ్చింది.




సాధారణంగా విమానం హైజాక్కు గురైనప్పుడు పైలట్ ఇలాంటి కోడ్ను పంపిస్తుంటారు. ఎయిరిండియా విమానం నుంచి ఈ సిగ్నల్ రాగానే.. ఏటీసీ సిబ్బంది భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేశారు. దీంతో విమానాన్ని జైపుర్కు మళ్లించి.. ఉదయం 9.45 గంటల సమయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ అలర్ట్ కోడ్ ను పైలట్ పంపించినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. అయితే, దీని వెనుక కారణాలు మాత్రం తెలియరాలేదు. ఘటనపై డీజీసీఏ దర్యాప్తు చేపట్టింది.

# నేను బాగానే ఉన్నా..

## నన్ను బాధపెట్టకండి: గౌతంరాజు



టాలీవుడ్ సీనియర్ నటుడు, కమెడియన్ గౌతమ్ రాజు అభిమానులకు విజ్ఞప్తి చేశారు. తాను ప్రస్తుతం చాలా ఆరోగ్యంగానే ఉన్నానని గౌతమ్ రాజు తెలిపారు. నటుడిగా వందల సినిమాల్లో నటించానని వెల్లడించారు. నా గురించి కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను బాధపెట్టేలా వార్తలు రాశారని గౌతమ్ రాజు అన్నారు. నేను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని రాశారు. దయచేసి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేయవద్దని ఆయన కోరారు. నా కెరీర్ లో నటుడిగా చెప్పుకోవడానికి నా దగ్గర వందల సినిమాలు ఉన్నాయని కూడా వెల్లడించారు.

కాగా.. గౌతమ్ రాజు నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టా, కమెడియన్ గా కొన్ని వందల సినిమాలు చేశారు. అగ్ర హీరోల చిత్రాల్లో తనదైన హావభావాలతో, నటనతో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సినిమాలు చేయకపోయినా.. సీరియల్స్ లో కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్యంపై రూమర్స్ రావడంతో సోషల్ మీడియాలో స్పందించారు. తాను 200లకు పైగా సినిమాల్లో నటించానని గౌతమ్ రాజు వెల్లడించారు. ఘరానా మొగుడు, వినోదం, ప్రేమకు వేళాయెరా లాంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించానని గుర్తుచేశారు.

తాను ఏ పత్రికకు ఎలాంటి ఇంటర్వ్యూ ఇవ్వలేదని గౌతమ్ రాజు తెలిపారు. తనపై వచ్చిన వార్తను చూసి స్నేహితులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎవరికైనా అనారోగ్యం వస్తే వారిని చూసి జాలిపడటమే కాకుండా.. వీలైతే సహాయం చేయాలని అన్నారు. అయితే, తాను ఆరోగ్యంగానే ఉన్నానని, సంతోషంగా జీవితాన్ని కొనసాగిస్తున్నానని స్పష్టం చేశారు. తన గురించి తప్పుడు కథనాలు రాయొద్దని.. సోషల్ మీడియా ప్రతినిధులను కోరారు.

# విండీస్దే నాలుగో టీ20

- కీమో పాల్ 'ఫైఫర్'..



హైదరాబాద్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ లో భారత్ పై వెస్టిండీస్ విజయం సాధించింది. కీమో పాల్ ఐదు వికెట్ల ప్రదర్శనతో విండీస్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్ లో ఇరు జట్లూ 2-2తో సమంగా నిలిచాయి. చివరి మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17న (శనివారం) జరగనుంది.

ఉప్పల్లో టాస్ ఓడిన విండీస్ తొలుత బ్యాటింగ్ చేసింది. కెప్టెన్ షై హోప్ (102₹) సెంచరీ సాధించాడు. దీంతో విండీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 223 పరుగులే చేయగలిగింది. విండీస్ బౌలర్ కీమో పాల్ (5/41) ఫైఫర్ దెబ్బకు టీమ్ఇండియా బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. సంజు శాంసన్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (43), నితీశ్ కుమార్ రెడ్డి (41) కాసేపు పోరాడారు.

# ఎస్ఆర్హెచ్లోకి స్టార్ ప్లేయర్ రీఎంట్రీ



ఐపీఎల్ లో కీలక ట్రేడ్ జరిగింది. ఢిల్లీ క్యాపిటల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ టి. నటరాజన్ సన్ రైజర్స్ హైదరాబాద్ లోకి రీఎంట్రీ ఇచ్చాడు. మరోవైపు సన్రైజర్స్ లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్ కు వెళ్లిపోయాడు. ఎస్ ఆర్ హెచ్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆటగాళ్ల ట్రేడ్ ను ఐపీఎల్ అధికారికంగా ప్రకటించింది.

**నటరాజన్ రీఎంట్రీ**

నటరాజన్ 2020 నుంచి 2024 వరకు ఐదు సీజన్ల పాటు సన్ రైజర్స్ హైదరాబాద్ కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సమయంలో అతడు జట్టు విజయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2024 ఐపీఎల్ సీజన్ లో 19 వికెట్లు పడగొట్టి, ఆ సీజన్ లో సన్ రైజర్స్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. అలాగే ఆ సీజన్ లో ఎస్ ఆర్ హెచ్ ను ఫైనల్ కు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరించాడు.

2025 ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ నటరాజన్ ను రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు ట్రేడ్ లో భాగంగా అతడు రూ.5 కోట్ల సవరించిన ఫీజుతో తిరిగి సన్ రైజర్స్ హైదరాబాద్ కు చేరనున్నాడు.

**ఢిల్లీ క్యాపిటల్స్ లోకి జీషన్ అన్సారీ**

లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరనున్నాడు. 2025 ఐపీఎల్ సీజన్ లో సన్రైజర్స్ హైదరాబాద్ తరఫున 10 మ్యాచ్ లు ఆడిన అతడు ఆరు వికెట్లు పడగొట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లోనే ఐపీఎల్ అరంగేట్రం చేసి మూడు వికెట్లు తీశాడు. 26 ఏళ్ల అన్సారీ తన ప్రస్తుత ఫీజు రూ.40 లక్షలతోనే ఢిల్లీ క్యాపిటల్స్ కు మారనున్నాడు. అతడి చేరికతో ఢిల్లీ జట్టు స్పిన్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.

# ఒకే ఓవర్లో 5 వికెట్లు

- సౌతాఫ్రికా బౌలర్ సంచలనం..



సౌతాఫ్రికా యువ ఫాస్ట్ బౌలర్ చాడ్ లేకాక్ టీ20 క్రికెట్ లో సంచలనం సృష్టించాడు. ఒకే ఓవర్ లో ఐదు వికెట్లు తీసి అరుదైన ఘనత సాధించాడు. ఇఖిఅ ప్రో20 కప్ 2026లో భాగంగా అక్టోబర్ 13న టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో నాటల్ ఇన్లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ రికార్డు ప్రదర్శన చేశాడు.

ఈ మ్యాచ్ లో లేకాక్ తన కోటా 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టాడు. ఇఖిఅ ప్రో20 కప్ చరిత్రలో ఇవే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు. యావత్ సౌతాఫ్రికా టీ20 క్రికెట్ చరిత్రలో ఒకే ఓవర్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్ గానూ లేకాక్ రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ టీ20 క్రికెట్ లో ఈ ఘనత సాధించిన ఐదో బౌలర్ గా నిలిచాడు.

టైటాన్స్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ లో లేకాక్ విశ్వరూపం ప్రదర్శించాడు. తొలి నాలుగు బంతులు, ఆతర్వాత ఆరో బంతికి వికెట్ తీసి టైటాన్స్ ఇన్నింగ్స్ ను తలకిందులు చేశాడు. 19వ ఓవర్ కు ముందు 4 వికెట్లకు 193 పరుగులతో పటిష్ఠంగా ఉన్న ఆ జట్టు.. ఓవర్ ముగిసేసరికి 9 వికెట్లకు 195 పరుగులకే పరిమితమైంది.

2003లో జన్మించిన లేకాక్ సౌతాఫ్రికా దేశవాళీ క్రికెట్ లో క్వాజులు-నాటల్ ఇన్ లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ అయిన లేకాక్ ఈ రికార్డు ప్రదర్శనకు ముందు 15 టీ20ల్లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీశాడు. అలాంటి ఆటగాడు ఒకే మ్యాచ్ లో ఆరు వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. లేకాక్ ఇప్పటివరకు సౌతాఫ్రికా జాతీయ జట్టుకు ఆడలేదు. స్వదేశంలో జరిగే ఎస్ఏ20 లీగ్ లోనూ అవకాశం లభించలేదు. ఈ ప్రదర్శన తర్వాత లేకాక్ పై ఎస్ఏ20 లీగ్ ఫ్రాంచైజీలు కన్నేయవచ్చు.

# అందుకే అందరూ రజనీకాంత్ని ఇష్టపడతారు: విద్యాబాలన్

ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ రజనీకాంత్ చాలా సింపుల్ గా ఉంటారని నటి విద్యాబాలన్ అన్నారు. అలా ఉండడం వల్లే ఆయన చాలామందికి నచ్చుతారని తెలిపారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో నటించిన 'జైలర్ 2' అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన విద్యాబాలన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రజనీకాంత్ తో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని పంచుకున్నారు.



''రజనీకాంత్ నుంచి నేర్చుకోవడానికి, మన జీవితంలో అలవర్చుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి. ఆయనలో ఎలాంటి ఆర్భాటం ఉండదు. సామాన్యుడిలా ఉంటారు. ప్రేక్షకులు ఆయన్ని ఇంతగా ప్రేమించడానికి కారణం కూడా అదే. అలాంటి లెజెండ్ తో కలిసి పనిచేసే అవకాశం రావడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఏమాత్రం ఒత్తిడి లేకుండా వర్క్ చేశా. ఒకవేళ ఆందోళనగా ఉన్నా, ఆయన తన మాటలతో దాన్ని తగ్గించేస్తారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తారు. ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ ప్రోత్సహిస్తారు'' అని విద్యాబాలన్ తెలిపారు.

**సిగరెట్ సన్నివేశం భయపడ్డా..**

ఇక 'జైలర్ 2'లో ఒక సన్నివేశం షూట్ చేసేటప్పుడు తాను భయపడినట్లు విద్యాబాలన్ తెలిపారు. రజనీకాంత్ ముఖంపై సిగరెట్ పొగ వదిలే సీన్ గురించి మాట్లాడారు. ''ఆ సన్నివేశానికి ఒక్కరోజు ముందు నాకు ఒకటిన్నర పేజీల కొత్త డైలాగులు ఇచ్చారు. ఆ డైలాగులు చెబుతూనే సిగరెట్ కూడా కాల్చాలి. దాన్ని ఎలా చేస్తానో అని భయపడ్డాను'' అని నటి తెలిపారు. ఈ సీన్ షూట్ చేసేటప్పుడు విద్యా బాలన్ చేతులు వణకడం తాను గమనించానని నెల్సన్ చెప్పారు.

# ప్రభాస్ గిఫ్ట్ ఇచ్చాడంటే ఇలానే ఉంటుంది

టాలీవుడ్ లో ప్రభాస్ పేరు చెప్పగానే సినిమాల కంటే ముందు అతడిచ్చే ఆతిథ్యమే గుర్తొస్తుంది. ఎందుకంటే భీమవరంకి చెందిన ప్రభాస్.. భోజన ప్రియుడు. ప్రస్తుతం మూవీస్ చేస్తున్నాడు కాబట్టి డైట్ మెంటైన్ చేస్తుంటాడు గానీ లేదంటే మనసారా నచ్చినవన్నీ తింటాడు. అయితే ప్రభాస్ సినిమా షూటింగ్ అంటే తన ఇంటి నుంచి వచ్చే ఫుడ్ తో టీమ్ కి కడుపు నింపేస్తుంటాడు. ఇప్పుడు 'ఫౌజీ' హీరోయిన్ కి అలాంటి సర్ ప్రైజే ఇచ్చాడు. 'ఫౌజీ' మూవీలో హీరోయిన్ గా చేస్తున్న ఇమాన్వి పుట్టినరోజు మంగళవారం(అక్టోబర్ 13) జరిగింది. దీనిని ఈమె సింపుల్ గా సెలబ్రేట్ చేసుకుంది. ప్రభాస్ మాత్రం ఈమె కడుపు, మనసు నిండిపోయేలా చేశాడు. నాన్ వెజ్ లో ఉన్న వెరైటీలన్నీ వండించి వాటిని ఇమాన్వికి పంపించాడు. వీటికి సంబంధించిన ఫొటో, వీడియో పోస్ట్ చేసిన ఈ బ్యూటీ.. కడుపు నిండిపోయింది ప్రభాస్ గారు అని పోస్ట్ పెట్టింది. ఇప్పుడే కాదు గతంలో సాహో, ఆదిపురుష్, రాధేశ్యామ్ సినిమాలు చేస్తున్న టైంలోనూ హీరోయిన్లు శ్రద్ధాకపూర్, కృతి సనన్, పూజా హెగ్డేలని ఫుడ్ తో కడుపు నింపేశాడు. ఇప్పుడు ఈ లిస్టులోకి తాజాగా ఇమాన్వి చేరింది.





# డివోషనల్గా పవర్ఫుల్ బీట్స్తో మ్యాచో స్టార్ 'భరత వర్ష' ఫస్ట్ సింగిల్!

టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ హీరోగా రీతూ వర్మ హీరోయిన్ గా జాతీయ అవార్డు గ్రహీత సంకల్ప్ రెడ్డి తెరకెక్కించిన అవైటెడ్ భారీ సినిమానే 'భరత వర్ష'. ఒక సాలిడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించిన ఈ సినిమా అప్డేట్స్ ఇపుడు ఒకొకటిగా వస్తున్నాయి. ఇక ఈ సినిమా నుంచి తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ ని లిరికల్ వీడియోగా వదిలారు.

అనుదీప్ దేవ్ సంగీతం అందించిన ఈ మొదటి పాట అమ్మ కదలి వచ్చె అనే సాహిత్యంతో కాంతార టైపు డివోషనల్ అండ్ పవర్ఫుల్ బీట్స్ తో ఒక ట్రాన్స్ లోకి తీసుకెళ్లే విధంగా ఉందని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇందులో విజువల్స్ చూస్తుంటే ఒక కొత్త ప్రపంచాన్నే సృష్టించినట్టు కూడా కనిపిస్తుంది. అలాగే ఎక్కువగా లావా, అగ్ని పర్వతపు విజువల్స్ ఎక్కువగా చూపించడం గమనార్హం.

ఇక వీటితో పాటుగా గోపీచంద్ డైనమిక్ ప్రెజెన్స్ తో కనిపిస్తున్నాడు. అలానే రీతూ వర్మ కూడా బ్యూటిఫుల్ లుక్స్ తో కనిపిస్తుంది. సో మొత్తానికి మాత్రం మంచి పాటని విడుదల చేసారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ వారు నిర్మాణం వహించగా త్వరలోనే రిలీజ్ డేట్ ని ప్రకటించనున్నారు.



# విరోష్ జంట గొప్ప నిర్ణయం.. ఏకంగా 400 కుటుంబాలకు..!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా వస్తోన్న పీరియాడికల్ మూవీ రణబాలి. రాయలసీమలో బ్రిటీశ్ కాలంలో జరిగిన ఆకృత్యాల నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించారు. దాదాపు కోటిమందికి పైగా ఆకలి చావులతో చనిపోయారని.. ఆనాటి దారుణ పరిస్థితులను ఇందులో చూపించనున్నారు. ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.



ఈ సంగతి పక్కనపెడితే తాజాగా రష్మిక, విజయ్ దంపతులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ జంట తమ గొప్ప మనసును చాటుకున్నారు. ఏకంగా 400 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం చేస్తామని ప్రకటించారు. అన్నపూర్ణ పేరుతో 400 ఫ్యామిలీస్ కు పౌష్టికహారం అందజేయనున్నట్లు రష్మిక వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. రష్మిక తన ఇన్ స్టాలో రాస్తూ..'మీరు పోషించే పాత్రలలో మిమ్మల్ని ప్రభావితం చేసే అంశాలు కొన్ని ఉంటాయి.. మీలో చాలా మంది 'జయమ్మకి, నాకు మధ్య ఏమైనా పోలికలు ఉన్నాయా?' అని అడుగుతూ ఉంటారు. దానికి నా సమాధానం ఉంది. ఇది ఎల్లప్పుడూ నేనే, ఇది ఆమె కూడా.. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిఫలంగా నేను ఎప్పుడూ ఇలాంటివి చేస్తూనే ఉంటా.. కానీ ఎప్పుడూ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాను. ఎందుకంటే, నాకు, నా బృందానికి, మాలో కొందరికి తెలిస్తే చాలు అనుకున్నా. కానీ ఇప్పుడు నేను దీని గురించి బయటపెడుతున్నా.. ఎందుకంటే ఇది మిమ్మల్ని, నా ప్రియమైన వారిని, ఇలాంటిది ఏదైనా చేయడానికి ప్రభావితం చేయగలిగితే.. నేను చాలా సంతోషిస్తాను. నేను ఈ రోజు 400 కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఒక్కో కుటుంబానికి 3 నెలల పాటు సహాయం చేయాలనుకుంటున్నా. రాబోయే ఒక సంవత్సరం పాటు దీనిని కొనసాగిస్తా. వారు ఆ డబ్బును నిత్యావసరాల కోసం ఆదా చేసి, దానిని తమ భవిష్యత్తును మెరుగ్గా ప్రణాళిక చేసుకోవడానికి ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా' అంటూ రాసుకొచ్చింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.